

వార్త
ఆదివారం
16 అక్టోబరు, 2022
5G
అవధుల్లేని
విజ్ఞాన విహారం
5G



# సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా మహేశ్‌బాబు?

మాటల మాంత్రికుడు, టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేశ్ బాబు కథానాయకుడుగా ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కొత్త షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ సినిమాలో ప్రిన్స్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కనిపించనున్నట్లు టాక్. అందుకు సంబంధించిన సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తారని సమాచారం. మ్యూజికల్ సెన్సేషన్ థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పూజాహెగ్డే కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై అందరిలో ఆసక్తి నెలకొంది.

# విభిన్నమైన కథాంశంతో 'రుద్రంగి'



ఒకవైపు విలన్‌గా, మరో వైపు ఇతర పాత్రలతో జగపతిబాబు బిజీ బిజీగా ఉన్నారు. అడపా దడపా నాయక లక్షణాలు కలిగిన ప్రధానమైన పాత్రలను సైతం చేస్తూ ముందుకు వెళుతున్నారు. ఆ నేపథ్యంలోనే ఆయన 'రుద్రంగి' అనే సినిమాను చేశారు. ఈ కథలో 'రుద్రంగి' ప్రస్తావన ఎక్కువగా వున్నప్పటికీ ఆమె కోసం ఎంతకైనా తెగించే పాత్రలో జగపతిబాబు కనిపించనున్నారు. రసమయి బాలకిషన్ నిర్మించిన ఈ సినిమాకి అజయ్ సామ్రాట్ దర్శకత్వం వహించాడు. టైటిల్ రోల్‌ను కన్నడ హీరోయిన్ పోషించింది. మమత మోహన్‌దాస్, ఆశిష్ గాంధీ ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. ఈ కథ దొరల కాలంలో జరుగుతుందని తెలుస్తోంది. త్వరలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు రానుంది.

తారాతీరం

ఆదివారం వార్త

sunmagvaartha@gmail.com

16 అక్టోబరు, 2022

## మంచి ముత్యాలు

ప్రేమ అన్నింటినీ జయిస్తుంది. అది విశ్వవిజేతల హృదయాలనైనా శాశ్వతంగా బంధించి వేస్తుంది.

\- అశోక చక్రవర్తి

## విషయ విశేషం


నచ్చిన చోట రంగవల్లికలు.... 4

'సంఘీ'భావం....5

పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం

ప్రపంచంలోనే అత్యంత అందమైన..6

కవర్ స్టోరీ..8

అవధుల్లేని

విజ్ఞాన విహారం

ఈవారం కవిత్వం..12

దర్వాజ

పర్యాటకుల మనసు దోచే సతారా..14

అబార్షన్లపై స్త్రీలకు హక్కులిచ్చిన..18

కథ.. 20

'దండం' దశగుణం భవేత్

సాహిత్యం.. 23

చలం అంటే అన్వేషణ

పుస్తక ప్రపంచం...26

చిత్రభారతి.. .30

ప్రతి సినిమాకు ఓ అందమైన చరిత్ర... 30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

సరదాగా కాసేపు నవ్వుకోండి..

వగైరా..వగైరా..





## తాజా వార్తలు

### ఈ లైబ్రరీకి రెండు చిరునామాలు



లైబ్రరీకి ఎందుకు వెళ్తాం..పుస్తకాలు చదువుకోవడానికేగా. కానీ 'హస్కెల్ ఫ్రీ' అనే గ్రంథాలయానికి మాత్రం దాన్ని చూడ్డానికి కూడా వెళుతుంటారు. ఇంతకీ దాని అడ్రస్ చెప్పాలా..అమెరికాలోని డెర్బీలేన్, వెర్మంట్..కెనడాలోని 1 న్యూచర్చ్‌స్ట్రీట్, క్యూబెక్. అదేంటీ..ఒక లైబ్రరీకి రెండు చిరునామాలా అంటే..ఇదుండేది రెండు దేశాల సరిహద్దుల్లో మరి. భవంతి మధ్యలోనూ బార్డర్‌లైన్‌తో అటు కెనడా ఇటు అమెరికా భూభాగాలు వేరుచేసి ఉంటాయి. రెండు దేశాల వారికీ ఉపయోగకరంగా ఉండేందుకు అమెరికాకు చెందిన కార్లోస్ హస్కెల్, కెనడా దేశస్థురాలైన అతని భార్య మార్తాస్టేవర్డ్ హస్కెల్‌లు దీన్ని 1904లో నిర్మించారు. ఎలాంటి నిబంధనలూ లేకుండానే ఈ భూభాగంలో ఒక దేశం నుంచి ఇంకో దేశానికి వెళ్లొచ్చు. రెండు దేశాల నుంచి 'వారసత్వ కట్టడం'గా గుర్తింపు పొందిన ఈ గ్రంథానికి స్థానికులతో పాటు పర్యటకులూ సరదాగా వస్తుంటారు.



### చెత్త వెలుగునిస్తోంది



ఈ ఊర్లలో వీధి లైట్లన్నీ చెత్తతో వెలుగుతాయి. ఎందుకంటే ఆ గ్రామాల్లో వ్యర్థాల్ని వృథాగా పారేయరు. ఒక్క దగ్గరకు చేర్చి దాన్నుంచే రోజూ విద్యుత్ తయారుచేస్తున్నారు. ఇదంతా తమిళనాడులోని శివగంగ జిల్లాలోని కంజీరంగాల్ అనే పంచాయితీ సంగతి. ఇక్కడుండే ఎనిమిది ఊళ్లలో ఇప్పుడీ విధానాన్నే పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇళ్లలో సేకరించిన చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆలోచనతో ఈ మధ్యే ఈ ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టారు. రోజూ వచ్చే 500 కిలోల వ్యర్థాలతోనే ప్రస్తుతం విద్యుత్ తయారుచూస్తూ దాన్ని వీధిలైట్లకు వాడుతున్నారట. దీంతో కరెంట్ బిల్ ద్వారా మిగిలిపోయే పంచాయితీ డబ్బుల్ని ఇతర గ్రామాభివృద్ధి పనులకు ఉపయోగిస్తున్నారు. పనికిరాని చెత్తనే పనికొచ్చేలా చేసిన ఈ ఐడియా బాగుంది కదూ!







# నచ్చినచోట రంగవల్లికలు అతికించుకోవచ్చు..

నక్షత్రాలను నేలపైన చుక్కలుగా పెట్టాల్సిన అవసరం లేదు. ఫ్యాబ్రిక్ లేదా ప్లాస్టిక్‌షీట్‌ను అనుకున్న డిజైన్‌లో కట్ చేసుకుని, దాని మీదుగా పూసలు, చమ్కీలు, కుందన్స్, మువ్వలు..ఇలా ఎంబ్రాయిడరీ వర్క్‌లో ఏమేం వాడతారో వాటన్నింటితో రంగుల రంగోలిని తీర్చిదిద్దుకోవచ్చు. చిన్నచిన్న పీసులుగా వాటిని తయారుచేసుకొని, ఒక ఆకృతిలో అలంకరించుకోవచ్చు.

## ఉలెన్ బాల్స్‌తో

నూలు దారాలతో రంగురంగుల వులెన్ బాల్స్ తయారుచేసి, వాటిని అందంగా పేర్చి, లేసులు, జరీ దారాలతోనూ అందమైన ముగ్గును తయారు చేసుకోవచ్చు.

ఉపయోగించని రోల్డ్‌గోల్డ్ జ్యూయెలరీ, పాత డ్రెసుల మీదున్న పాడవని డిజైనర్ మార్క్‌లను కట్ చేసి కూడా ఈ రంగవల్లులను సృష్టించుకోవచ్చు. గదిలోపల వేసే బార్డర్లు, ముగ్గు చివరల వేసే అంచు భాగాలకూ బార్డర్స్ విడిగా లభిస్తున్నాయి. కేవలం ఈ బార్డర్ డిజైన్‌తో కూడా మరో అందమైన ముగ్గును తీర్చిదిద్దవచ్చు.





# 'సంఘీ' భావం



## పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం

**భా**రతదేశంలో డ్రగ్స్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం, దేశ సరిహద్దులు దాటి సులభతరంగా అక్రమంగా రవాణా చేయగల స్థాయికి మాఫియా ఎదిగిపోవడం వంటివి దేశంలో డ్రగ్స్ వినియోగం విపరీతంగా పెరగడానికి అవకాశం కల్పిస్తోంది. డ్రగ్స్ వినియోగంపై జరిపిన సర్వే ప్రకారం కరోనా తరువాత ఒక్కసారిగా దేశంలో 30 శాతం డ్రగ్స్ వినియోగం పెరిగింది. అంతకు ముందు ఏటా నాలుగు నుంచి ఆరు శాతం మాత్రమే పెరుగుదల ఉండేది. ప్రస్తుతం సగటున పది నుంచి 12 శాతానికి పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. వివిధ మార్గాల్లో మన దేశంలోకి ప్రవేశించిన డ్రగ్స్‌ను డార్క్ వెబ్ సైట్స్ ద్వారా మాఫియా క్షేత్రస్థాయికి విజయవంతంగా తరలించి సొమ్ము చేసుకుంటోంది. గతంలో కేవలం ఉన్నత వర్గాలకు మాత్రమే అందుబాటులోఉన్న మాదకద్రవ్యాలు ప్రస్తుతం హైస్కూలు స్థాయి విద్యార్థులకు కూడా చేరుతున్నాయి. ఢిల్లీలో పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కొందరు డ్రగ్స్‌కు బానిసలైనట్లు అధికారులు గుర్తించారు. దేశంలో డ్రగ్స్ వినియోగం పెరగడంతో అంతర్జాతీయ స్థాయి మాఫియా ముఠాలు ఇటువైపు దృష్టి సారించాయి. ఇతర దేశాలతో పోలిస్తే ఇక్కడ ఇబ్బందులు లేకుండా డ్రగ్స్ పంపిణీ చేసే అవకాశాలు ఉన్నట్లు మాఫియా గుర్తించింది. కేరళలోని కొచ్చిన్ తీరంలో రెండు వందల కిలోల హెరాయిన్ పట్టుపడిందంటే మన దేశంలో డ్రగ్స్ వినియోగం ఏ మేరకు సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో డ్రగ్స్ వినియోగానికి సంబంధించిన చట్టాలు అంత కఠినంగా లేవు. కేవలం కారాగార శిక్షలతోనే సరిపెడుతున్నారు. ఇది కూడా నేరం రుజువై శిక్ష పడే సరికి సంవత్సరాలు పడుతోంది. డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడిన వారు కేవలం రెండు నెలల వ్యవధిలోనే బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ ఇదే దంధాను కొనసాగిస్తున్నారు. పోలీసులు ఇప్పటి వరకు డ్రగ్ పెడరల్స్‌ను మాత్రమే పట్టుకుంటున్నారు. అంతకు మించి కేసు దర్యాప్తు ముందుకు సాగడం లేదు. కిందిస్థాయిలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారు, వీరి దగ్గర డ్రగ్స్ కొని వినియోగించిన వారు మాత్రమే పోలీసులకు చిక్కుతున్నారు. డ్రగ్స్ తయారీదారులు వివిధ దేశాల నుంచి ఇక్కడకు భారీగా దిగుమతులు చేస్తున్న కీలక వ్యక్తులను మాత్రం పోలీసులు పట్టుకోవడం లేదు. దీనితో డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్ ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతోంది. గత ఆరేళ్లుగా పరిశీలిస్తే డ్రగ్స్ వినియోగం 60 నుంచి 70 శాతం పెరిగిందని అంచనా వేస్తున్నారు. హెరాయిన్, బ్రౌన్‌షుగర్, క్రిస్టల్‌మెత్, ఎల్‌ఎస్‌డి, మెఫెడ్రోన్ వంటివి అత్యంత నాణ్యమైన ఖరీదైన డ్రగ్స్ ప్రస్తుతం అందుబాటులో ఉంటున్నాయి. దీనికి తోడు స్థానికంగా ఔషధాలను ఉపయోగించి కొందరు మత్తు పదార్థాలను తయారుచేస్తున్నారు. ఫార్మాకంపెనీల నుంచి అక్రమంగా కొన్ని ఔషధాలు సేకరించి వాటితో తయారుచేసిన మత్తుపదార్థాలను విద్యాసంస్థలకు తరలిస్తున్నారు. 1985లో ఎన్‌డిపిఎస్ యాక్ట్‌ను తీసుకువచ్చారు. ఈ చట్టంలో పది సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అయితే ఆధారాల సేకరణ విషయంలో ఇబ్బందులు ఎదురుకావడంతో నిందితులు చట్టం నుంచి శిక్ష పడక ముందే తప్పించుకుంటున్నారు. ఒకవేళ శిక్ష పడినా కొన్ని నెలలు మాత్రమే జైలు జీవితాన్ని గడిపి బయటకు వస్తున్నారు. ప్రస్తుతం 35 దేశాల్లో డ్రగ్స్ సరఫరా చేసే వారికి మరణ శిక్ష విధించే విధంగా చట్టాలు అమలుచేస్తున్నారు. చైనా, సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, ఇరాన్, వియత్నామ్ వంటి దేశాల్లో మరింత కఠినంగా శిక్షలను అమలుచేస్తున్నారు. దీనితో డ్రగ్స్ వ్యవహారంలో తలదూర్చేందుకు నేరస్థులు భయపడుతుంటారు. పైగా అక్కడ డ్రగ్స్ నిర్మూలన విభాగాలు అత్యంత పటిష్టంగా ఉంటాయి. ఇక్కడ పనిచేసే వారికి వివిధ స్థాయిలో శిక్షణ ఇస్తారు. సాధ్యమైనంత వరకు డ్రగ్స్ ముఠాలను పట్టుకోవడానికి ఈ విభాగాలు ఆసక్తి చూపిస్తుంటాయి. ఈ దిశగా దర్యాప్తును కొనసాగిస్తాయి.

అయితే మన దేశంలో ఇందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. ఎన్‌డిపిఎస్ విభాగంలో పనిచేసే సిబ్బందికి, అధికారులకు తగినంత శిక్షణ ఉండటం లేదు. దేశంలో డ్రగ్స్ కేసులను లోతుగా దర్యాప్తు చేసేందుకు కొందరు అధికారులు శ్రద్ధ చూపినప్పుడు రాజకీయ ప్రముఖులు జోక్యం చేసుకుని కేసు దర్యాప్తు ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తరచుగా ఈ పరిస్థితి కనిపిస్తుంది. ఆంధ్రాతో పోలిస్తే తెలంగాణలో ఎన్‌డిపిఎస్ అధికారులు కొంత ముందంజలో ఉన్నారని చెప్పుకోచ్చు. ఇటీవల రాష్ట్రంలో డ్రగ్స్ పట్టుపడినప్పుడు సీనియర్ ఐపిఎస్ అధికారులు కేసును లోతుగా దర్యాప్తు చేయడానికి ప్రయత్నించారు.

అయితే వారు అనూహ్య రీతిలో దర్యాప్తును పక్కన పెట్టడం, లేదా సదరు అధికారులను బదిలీ చేసి ఏమాత్రం గుర్తింపు లేని పోస్టింగ్‌లు ఇవ్వడం పరిపాటి అయ్యింది. ఇలాంటి పరిస్థితులు డ్రగ్స్ మాఫియాకు అనుకూలంగా మారుతున్నాయి. రాష్ట్రంలో పంజాబ్‌లో మాత్రమే అత్యధికంగా డ్రగ్స్ వినియోగం ఉండేది. ప్రస్తుతం ఈ రాష్ట్రం పక్కన మరో ఆరు రాష్ట్రాలు చేరాయి. జమ్మూ కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌లతో పాటు బంగ్లాదేశ్ సరిహద్దుల నుంచి భూభాగం మీదుగా కూడా డ్రగ్స్ దేశంలోకి చేరుతున్నాయి. ఒక పక్క డ్రగ్స్ సరఫరా పెరిగితే అందుకు అనుగుణంగా గంజాయి వినియోగం కూడా పెరుగుతూ వస్తోంది. కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడటానికి అత్యధిక సంఖ్యలో యువకులు గంజాయి రవాణాలో భాగస్వాములు అయ్యారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్‌నివారణ విషయంలో కఠినంగా వ్యవహరించకపోతే పరిస్థితులు మరింతగా దిగజారే ప్రమాదం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ





# ప్రపంచంలోనే అత్యంత అందమైన గులాబీలు

మల్లెలు....గులాబీలు....సంపెంగ....లిల్లీ....బంతి....చామంతి....కనకాంబరం.... కార్నేషన్.... గ్లాడియోలస్....ఇలా చెప్పుకుంటూ పోతో పూలల్లో ఎన్నో వర్ణాలు, మరెన్నో అందాలు, ఇంకెన్నో సుమధుర సోయగాలు. ఇలా అన్నీ నయనానందకరమే.. మానసికోల్లాసమే.. ప్రకృతి మనకిచ్చిన అందమైన, రంగురంగుల బహుమతులు ఈ పువ్వులు. మధుమైన సువాసన, పులకింపచేసే అందమైన సొగసులతో మనలను నిత్యం అలరిస్తాయి, సంతోషాన్నిస్తాయి. అందుకే భారతదేశమైనా, ప్రపంచంలోని ఏ దేశమైనా పువ్వులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వబడుతోంది. అలాగే పువ్వుల రంగులకు కూడా వేర్వేరు అర్థాలు ఉన్నాయి. కొన్ని ప్రేమ, స్నేహం, సంతోషానికి ప్రతీకగా భావిస్తే కొన్ని చావు, విషాదాలకు అనుగుణంగా ఉంటాయి. పువ్వులకే రాణిగా చెప్పుకునే గులాబీలు అంటే ఇష్టపడని వారు ఉండరు. అలాగే అందానికి ప్రతీకగా ఉండే పువ్వులు ఏవంటే అది నిస్సందేహంగా గులాబీలే. ఎర్ర గులాబీలు ప్రేమకు చిహ్నం కాగా, పసుపు గులాబీలు స్నేహానికి ప్రతీక, తెలుపు గులాబీలు మనిషిలో శాంతి, మంచి తనానికి గుర్తింపు. అయితే ఆసియా ప్రాంతంలో తెలుపు గులాబీలను చావు, విషాద సందర్భాలకు వాడితే, యూరోపియన్ దేశాలలో పవిత్రత, అమాయకత్వానికి ప్రతీక. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత అందమైన గులాబీల గూర్చి ఇప్పుడు తెలుసుకుందాం.

**రోసా అల్బెరిక్ బార్బియర్**

ఇది రోసా లూసియా, షిర్లీ హిబ్బర్డ్ యొక్క క్రాస్ నుండి వచ్చిన ఒక క్లైంబింగ్ రోజ్. దీనిని 1993 సంవత్సరంలో రాయల్ హార్టికల్చరల్ సొసైటీ పరిచయం చేసింది. ఈ గులాబీలు తేలికపాటి, వెచ్చని వాతావరణం ఉన్న ప్రాంతాల్లో పెరుగుతాయి. దీనికి సరైన సపోర్టు ఉంటే 4 నుండి 8 మీటర్ల మధ్య పెరుగుతుంది. ఈ గులాబీలు క్రీమ్ రంగులో ఉంటాయి. ఇవి సుమారు 4 సెంటీమీటర్ల వ్యాసం కలిగి ఉంటాయి. ఎంతో అందంగా, అమాయకంగా కనిపించే ఈ గులాబీలు ప్రధానంగా వసంత మాసంలోనే పూస్తాయి.

**రోసా బెంజమిన్ బ్రిటన్**

ఇది 2001 సంవత్సరంలో రోసలిస్టా డేవిడ్ ఆస్టిన్ చే సాగు చేయబడిన ఆధునిక గులాబీలు. ఆకర్షణీయమైన వెండి రంగులో ఉండే రివర్స్ రేకులతో కూడిన గాఢమైన పగడపు గులబీ ఎరుపు రంగులో ఈ పువ్వులు కన్పిస్తాయి. వీటిని ఆస్ట్రేలియాలో 2005లో సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్‌తో అత్యంత అందమైన గులాబీగా ప్రదానం చేశారు. ఈ గులాబీ మొక్క నిగనిగలాడే ముదురు ఆకుపచ్చ ఆకులతో 1,2 మీటర్ల పొదవు, తక్కువ పొదగా పెరుగుతుంది. ఈ గులాబీ పువ్వులు 41 రేకులతో సుమారు 10 డెసీ మీటర్ల వ్యాసం కలిగి ఉంటాయి. ఇవి ఏడాది పొడవునా మొలకెత్తుతాయి. దీని వాసన ఒకింత మత్తు ఎక్కిస్తుంది.

**పింక్ క్రిస్లర్ ఇంపీరియల్**

రోసా క్రిస్లర్ ఇంపీరియల్ అనేది బలమైన సువాసనగల, ముదురు ఎరుపు రంగు హైబ్రిడ్ టీ గులాబీ. ఈ రకాన్ని 1952లో యునైటెడ్ స్టేట్స్‌లో కెనాడా ఫ్లింట్రిడ్జ్,



కాలిఫోర్నియాలోని డెస్కాన్సో గార్డెన్స్‌కు చెందిన డాక్టర్ వాల్టర్ ఇ లామెర్ట్‌లు పెంచారు. ఆల్ అమెరికన్ రోజ్ సెలక్షన్స్‌లో అన్ని దేశాల్లో లభించే గులాబీల్లో కెల్లా ఈ క్రిస్లర్ ఇంపీరియల్ గులాబీ ఎంపికైంది. 1953లో క్రిస్లర్ ఇంపీరియల్‌తో సహా రెండు గులాబీలకు మాత్రమే ఆల్ అమెరికన్ రోజెస్ సెలక్షన్‌లో ఎంపిక అయినా వీటికి రెండు, మూడు స్థానాలు మాత్రమే దక్కాయి. న్యూయార్క్ సిటీలోని రాక్‌ఫెల్లర్ ప్లాజాలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో క్రిస్లర్ ఇంపీరియల్ గులాబీకి అవార్డును మిస్ నాన్సీ ట్రూ థోర్న్, టోర్నమెంట్ ఆఫ్ రోజెస్ క్వీన్ అందించింది. సొగసైన కుచించుకుపోయిన బుగ్గల్లా ఈ గులాబీ మొగ్గలు దాదాపు 11 నుండి 13 సెంటీమీటర్ల వ్యాసంతో అధిక కేంద్రీకృత పుష్పాలుగా తెరుచుకుంటాయి. అంతేకాకుండా అధిక సంఖ్యలో 45 నుండి 50 రేకులను కలిగి ఉంటాయి. లోతైన, వెల్వెట్ ఎరుపు రంగుతో అద్భుతంగా ఉంటుంది. ఈ పువ్వులు వసంత రుతువులో ప్రారంభమై చివరి వరకూ పూస్తాయి. పొడవాటి కాండం ఉన్న ఈ గులాబీ పువ్వులు దీర్ఘకాలం, ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ గులాబీ మొక్క 75 నుండి 200 సెంటీమీటర్ల ఎత్తు, 60 నుండి 120 సెంటీమీటర్ల వ్యాసం వరకూ పెరుగుతుంది.

### రోసా డ్యూయెట్

రోజ్ డ్యూయెట్ అనేది 1960 సంవత్సరంలో అమెరికన్ గులాబీ పెంపకందారుడు హెర్బ్ స్వీమ్ చేత కనుగొనబడింది. డ్యూయెట్ అనేది రోసేసీ (గులాబీ) కుటుంబానికి చెందిన హైబ్రీడ్ టీ గులాబీ. 1961లో ఈ గులాబీకి ఆల్ అమ్ ఎరికీ రోజ్ సెలెక్షన్స్ అవార్డు లభించింది. ఇది టీ హైబ్రీడ్ల సమూహానికి చెందినది. ఈ గులాబీ మొక్క 1 నుండి 1,5 మీటర్ల ఎత్తు వరకూ పెరుగుతుంది. ఈ మొక్క నాలుగు లేక ఐదు పువ్వులను విడివిడిగా లేక సమూహంగా పుష్పిస్తాయి. ఈ రోజ్ డ్యూయెట్ పువ్వు 3 నుండి 6 అంగుళాల పరిమాణం కలిగి, పింక్ కలర్‌లో ఉండి 26 నుండి 40 రేకులను కలిగి ఉంటాయి. పువ్వు పై భాగం పగడపు స్పర్శత లేత గులాబీ రంగులో ఉంటుంది. దిగువ భాగం ముదురు ఊదా గులాబీ రంగులో ఉంటుంది. ఇవి వేసవిలో వికసిస్తాయి. చూడటానికి అందంగా, అహ్లాదరకంగా అనిపించి మధురమైన అనుభూతులను కలిగిస్తాయి.

### రోసా ఫ్రాంకోయిస్ జురాన్విల్లే

రోసా ఫ్రాంకోయిస్ జురాన్విల్లే విచురానా హైబ్రిడ్ల సమూహానికి చెందిన క్లైంబిగ్ గులాబీ. 1906 సంవత్సరంలో రోసలిస్టా రెన్ బార్బియర్ చేత కనుగొనబడింది. ఫ్రాంకోయిస్ జురాన్విల్లే అనేది బార్బియర్ నర్సరీ ద్వారా పెంపకం చేయబడిన ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన గులాబీగా ప్రసిద్ధి చెందిం ది. ఈ గులాబీ మొక్క సుమారు 8 మీటర్ల ఎత్తు వరకూ పెరుగుతుంది. వసంత, వేసవిలో ఇది పింక్ రంగు పువ్వులను పూస్తుంది. ఈ పువ్వులు మృదువైన సువాసనతో 7 సెంటీమీటర్ల వ్యాసంతో ఉంటాయి. ఇవి చల్లని వాతావరణంలో సాధారణంగా



సంవత్సరానికి ఒకసారి గుత్తులుగా వికసిస్తాయి. తరువాత చెల్లాచెదురుగా పుష్పిస్థాయి. ఫ్రాంకోయిస్ జురాన్విల్లే బలమైన, ఫల సువాసనను కలిగి ఉంటుంది. ఈ పువ్వు పసుపు రంగుతో సాల్మన్ పింక్‌తో కనిపిస్తాయి. రాయల్ నేషన్ రోజ్ సొసైటీ ద్వారా ఈ ఫ్రాంకోయిస్ జురాన్విల్లే గులాబీకి గార్డెన్ మెరిట్ అవార్డు లభించింది.

### రోసా ఐస్బర్గ్

రోసా ఐస్బర్గ్ అనేది 1927



సంవత్సరంలో జర్మనీ గులాబీ పెంపకందారుడు రీమెర్ కోర్డెస్‌చే వెలుగులోకి వచ్చింది. వీటిలో రెండు రకాలు ఉన్నాయి. ఒకటి 1,5 మీటర్ల ఎత్తు వరకూ పొదగా పెరుగుతుంది. మరొకటి 3 నుండి 5 మీటర్ల వరకూ పెరుగుతుంది. వీటి పువ్వులు ధవళకాంతితో మెరుస్తూ ఉంటాయి. మత్తెక్కించే సువాసన కలిగిన ఈ పువులు 25 నుండి 35 రేకు మధ్య పుష్పిస్తుంది. 1958 సంవత్సరంలో రాయల్ నేషనల్ రోజ్ సొసైటీ ప్రదర్శనలో ఈ రోసా ఐస్బర్గ్‌కు బంగారు పతకం లభించడం విశేషం.



**- సిహెచ్‌వివి రఘుబాబు**




# అవధుల్లేని విజ్ఞాన విహారం

కవర్ స్టోరీ

**సుంకవల్లి సత్తిరాజు**

**ప్రపంచం ఎంతగానో మారిపోయింది. ఖండాలు, దేశాలు, మహాసముద్రాలు ఎక్కడికీ పోలేదు, ఎక్కడివి అక్కడే ఉన్నాయి. భౌగోళిక స్వరూపం మారలేదు. భూభ్రమణ, పరిభ్రమణ ప్రక్రియలు యథాతథంగా కొనసాగుతున్నాయి. అయినప్పటికీ ఈ భూప్రపంచం కాలక్రమంలో అతి చిన్నగా, అరచేతిలో ఇమిడిపోయే విధంగా మారిపోయింది. మొన్నటి వరకు ప్రపంచమంటే అతి విశాలమైనదని భావించేవాళ్లం. అది కాస్తా ఒక 'గ్లోబల్ విలేజ్'గా రూపాంతరం చెందింది. వర్తమాన పరిస్థితులు ప్రపంచాన్ని పిడికిలిలో బంధించే విధంగా మారిపోతున్నాయి.**

ప్రపంచంలో ఎన్నో వింతలున్నాయి. ఈ వింతలన్నింటినీ తలదన్నే విధంగా కలలో ఊహించని మరో వింత ఇలలో సాకారమైంది. అదే అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తున్న '5జి ప్రపంచం'.

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన 5వ తరం సాంకేతిక పరిజ్ఞానం మన ముంగిట లాంఛనంగా సాక్షాత్కరింపబడింది. ఒక వినూత్న ప్రపంచం ఆవిష్కరించబడింది. ప్రపంచం డిజిటల్ యుగంలోకి నెట్టబడింది. ఎన్నో పరిశోధనలు, ఎన్నో అవాంతరాలు, మరెన్నో అనుమానాలు, ఇంకెన్నో ఆర్థిక, సాంకేతిక పరమైన అడ్డంకులను దాటుకుంటూ, ప్రపంచ గమనం 5జి డిజిటల్ శకం వైపు సాగిపోతున్నది. "కృషితో నాస్తి దుర్భిక్షం" అనే హితోక్తిని మానవ విజ్ఞానం సాకారం చేసింది. సాంకేతిక రంగం కొంగొత్త పుంతలు తొక్కుతున్నది. పరిశోధనా ఫలాలు సామాన్యుల చెంత చేరుతున్నాయి. శాస్త్రవేత్తల నిర్విరామ పరిశోధనలు జన జీవన స్రవంతిలో వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతున్నాయి. చందమామ, బొమ్మరిల్లు కథల పుస్తకాల్లో చదివిన ఊహాత్మకమైన కథలు, కల్పనలు, మన చిన్నతనంలో మన పెద్దలు చెప్పిన విచిత్రమైన కథలు వర్తమానంలో వాస్తవ రూపం ధరిస్తున్నాయి. సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నాయి. వైర్‌లెస్ టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థలో 5జి సేవలు మానవాళిని ఒక అద్భుతమైన ప్రపంచంలోకి తీసుకెళ్లబోతున్నాయి. కొన్ని దేశాలకు, కొన్ని నగరాలకు మాత్రమే లాంఛనంగా అమల్లోకి వచ్చిన 5జి సేవల అనుభూతిని ప్రపంచం మొత్తం పరిపూర్ణమైన స్థాయిలో ఆస్వాదించడానికి మరికొంత సమయం పట్టవచ్చు.

అప్పటివరకు ఇప్పుడు 5జి సేవలను ఆస్వాదిస్తున్న ప్రజల అనుభవాలను, అనుభూతులను తెలుసుకుని, మన చెంతకు 5జి వచ్చేవరకు నిరీక్షించక తప్పదు.

ఒకప్పుడు ఉత్తరాల ద్వారా సమాచారం తెలుసుకునేవారు. ఉత్తరాల బట్వాడాలో అవరోధాలు, రవాణా వ్యవస్థ సరిగా లేకపోవడం, మానవ శక్తినే అధికంగా వినియోగించడం వంటి కారణాల వల్ల ఒకరి నుంచి మరొకరికి సమాచారం అందించడంలో వారాలు, నెలల తరబడి జాప్యం జరిగేది. పావురాలను కూడా యుద్ధ సమయాల్లో అప్పట్లో వార్తల చేరవేతకు వినియోగించేవారు. అత్యంత అవసరమైన పరిస్థితుల్లో టెలీగ్రామ్‌లను పంపేవారు. టెలిఫోన్ ఆవిష్కరణతో కొంతవరకు సమాచార సేకరణ సాధ్యమైనప్పటికీ అది కూడా పూర్తిగా అందరికీ అందుబాటులో ఉండేది కాదు. ఏది ఏమైనప్పటికీ టెలిఫోన్ ఆవిష్కరణ తర్వాత కాలక్రమంలో కమ్యూనికేషన్ వ్యవస్థలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయి. నిస్తంత్రీ విధానం(వైర్‌లెస్)లో జరిగిన చరవాణి రూపకల్పన, వినియోగం మానవ జీవితాల్లో పెనుమార్పులు తెచ్చింది.

చరవాణి ఆవిష్కరణ 'వైర్‌లెస్ టెలీ కమ్యూనికేషన్' వ్యవస్థలో ఒక వినూత్న అధ్యాయం. మొదటి తరం మొబైల్ ఫోను(1జి) కనిపెట్టిన తర్వాత మరింత ఉన్నతంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా సమాచారాన్ని అందించాలనే మహోన్నతమైన ఆశయంతో, అవిశ్రాంత కృషితో, ఆసక్తితో, సంకల్ప బలంతో కాలానుగుణమైన అవసరాలకు అనుగుణంగా సుదీర్ఘ పరిశోధనల ఫలితంగా 1జి తర్వాత వరుసగా 2జి, 3జి, 4జి వైర్‌లెస్ మొబైల్ నెట్‌వర్క్‌లు ప్రారంభించబడి, వినియోగంలోకి వచ్చాయి. ప్రస్తుతం 5జి రూపంలో ప్రపంచం డిజిటల్ యుగంలోకి ప్రవేశించింది. కోతి నుండి పరివర్తన చెందిన మానవుడు జీవ పరిణామ క్రమంలో భాగంగా బుద్ధి జీవిగా భూమిపై అవతరించాడు. ఇది మానవులకే సుసాధ్యమైంది. అపారమైన మేధస్సు కేవలం మానవులకు మాత్రమే స్వంతం. మానవ మస్తిష్కంలో పుట్టిన అనేక ఆలోచనలు కార్యరూపం దాల్చడానికి పట్టుదల, నిరంతర కృషి, విజ్ఞాన తృష్ణ, అధ్యయనం పరిశీలన, పరిశోధన ఎంతగానో దోహదపడ్డాయి. ప్రతీ విషయాన్ని లోతుగా విశ్లేషించడం ద్వారా ప్రతీ అంశం పైన ఎన్నో ప్రశ్నలు మానవ అంతరంగంలో కడలి కెరటాల్లా ఉవ్వెత్తున ఎగసిపడి ఒక సంఘర్షణకు దారితీసాయి. ఆ సంఘర్షణ నుంచి వికసించినదే విజ్ఞానం. మానవ జిజ్ఞాస అనేక పరిశోధనలకు దారితీసింది. ఆకులు, అలాలు, కందమూలాలు తింటూ– జంతువులను వేటాడి, పచ్చి మాంసం తింటూ నగ్నంగా తిరుగాడుతూ అడవుల్లో పొదల చాటున నిద్రిస్తూ, భద్రత లేని దుర్భర జీవితం గడిపిన ప్రాచీన మానవుడు ఆధునిక మానవుడిగా ఆవిష్కరించడానికి సుదీర్ఘ నిరీక్షణ తప్పలేదు. నేటి ఆధునిక కాలంలో అత్యంత విలాసవంతమైన జీవితాన్ని గడపడానికి మానవ ఆలోచనలే ఆలంబనగా నిలిచాయి. జీవించడానికి అనువైన గృహాలు, రోడ్డు రవాణా సౌకర్యాలు, జల, వాయు ప్రయాణ మార్గాలు ముఖ్యంగా విమానయానం ప్రపంచంలోని పలు దేశాలను మానసికంగా ఏకం చేసింది. వాతావరణ పరిస్థితుల నుండి కాపాడుకోవడానికి, తుఫానులు, ఇతర ప్రకృతి విలయాల నుండి క్షేమంగా బయట పడడానికి అభివృద్ధి చెందిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపకరిస్తున్నది. సాంకేతిక రంగంలో పడిన ఒక ముందడుగు వందడుగుల దూరాన్ని దగ్గర చేసింది. ఆ మొదటి అడుగు 'టెలీఫోన్' అని చెప్పక తప్పదు. ఈరోజు




సాంకేతిక రంగంలో వచ్చిన మార్పుకు టెలిఫోన్ ఆవిష్కరణ ఒక ప్రేరణగా నిలిచింది. సాధారణ టెలిఫోన్ నుండి చరవాణి ఆవిష్కరణ వరకు జరిగిన అనేక పరిణామాలు మానవ జీవితాలను విశేషంగా ప్రభావితం చేసాయి. మొదటి తరం కేవలం మాట్లాడుకోవడానికి, సంక్షిప్త సందేశాలు పంపించడానికే పరిమితమైంది. పైగా పరిమితమైన టవర్ల సంఖ్య వలన నిర్వహణా సామర్థ్యం సరిగా లేకపోవడం వలన, సిగ్నల్స్ లోపం వలన వినియోగదారులకు విపరీతమైన అసౌకర్యం ఏర్పడింది. శబ్ద ప్రసారంలో లోపాలు తలెత్తడం, మాటల మధ్యలో సిగ్నల్స్ అర్ధాంతరంగా నిలిచిపోవడం వలన సంభాషణలో అంతరాయం కలిగి, వినియోగదారులకు ఇబ్బందికరంగా ఉండేది. ఇలాంటి అవాంతరాలను అరికట్టడానికి 2జికి ఆధునీకరించబడిన మొబైల్స్ ఫోన్స్ అందుబాట్లోకి రావడం జరిగింది. 1జి నుంచి 5జి వరకు సాగిన నలభై ఏళ్ల సుదీర్ఘ సాంకేతిక ప్రస్థానం అనేక రంగాల అభివృద్ధికి దోహదం చేసింది. కానీ చాలా దేశాలు ఇంకా సరైన ఆధునిక సాంకేతిక పరికరాలు లేక అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. కొన్ని దేశాలకు ఇప్పటికీ 4జి పరిజ్ఞానం అందుబాట్లో లేదు. ఇంకా 2జి, 3జిలతో సరిపెట్టుకునే దేశాలెన్నో ఉన్నాయి. అన్ని దేశాలు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అభివృద్ధిలో ముందంజ వేయాలి. రేడియో, టీవి, టెలిఫోన్, శాటిలైట్ వ్యవస్థ, ఇంటర్నెట్, కంప్యూటర్ నెట్‌వర్క్‌లన్నీ టెలీ కమ్యూనికేషన్ రంగం పరిధిలోకి వస్తాయి. రేడియో, టెలివిజన్, టెలిఫోన్ ఆవిష్కరణలు సమాచార, ప్రసార, ప్రచార రంగాలను సమూలంగా మార్చేశాయి. ఇటలీకి చెందిన "మార్కోనీ' రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థకు అంకురార్పణ చేసాడు. రేడియో ఆవిష్కరణ సమాచార రంగంలో ఒక మైలురాయి. మార్కోనీ, నికోలా టెస్లా తదితరులు 1893-96 సంత్సరాల మధ్య కాలంలో వైర్ లెస్ రేడియో కమ్యూనికేషన్ వ్యవస్థ కోసం విశేష కృషి చేసి విజయవంతమై నారు. మొదటి ప్రాథమిక టెలిఫోన్‌ను ఇటలీకి చెందిన ఆంటోనియా మెయుచి కనుగొన్నాడు.

ఫ్రెంచ్‌కు చెందిన చార్లెస్ బౌర్స్యుల్ 1849లో టెలిఫోన్ పరికరాన్ని కనిపెట్టి, దాని రూపకర్తగా పేరొందినప్పటికీ, అలెగ్జాండర్ గ్రాహంబెల్ 1876లో టెలిఫోన్ పరికరానికి పేటెంట్ హక్కు పొందాడు. స్కాట్లాండ్‌కు చెందిన అలెగ్జాండర్ గ్రాహంబెల్‌ని టెలిఫోన్ ఆవిష్కర్తగా ప్రపంచం గుర్తించింది. మానవాళి మధ్య సమాచార వ్యక్తీకరణకు టెలిఫోన్ మొదటి గొప్ప ఆవిష్కరణ. టెలీ అంటే గ్రీకు భాషలో దూరం అనీ, ఫోను అంటే వాణి అని అర్థం. దూరవాణి అంటే దూర సమాచారాన్ని చేరవేసే ఒక పరికరం. శబ్ద తరంగాలను విద్యుత్ తరంగాలుగా మార్చి తీగల ద్వారా సమాచారం అందించే పరికరం టెలిఫోన్. ట్రాన్స్‌మిషన్, రిసీవర్‌లు టెలిఫోన్‌కు ఆయువుపట్టు. ఎన్నో మలుపులు, మరెన్నో పరిశోధనల ఫలితంగా చరవాణి ఆవిష్కరింపబడి, మానవ ప్రపంచాన్ని దగ్గర చేసింది. అమెరికాలోని మొటొరోలా కంపెనీలో ఇంజినీర్‌గా పని చేస్తున్న 'మార్టిన్ కూపర్' మొట్టమొదటి సారిగా చరవాణిని కనుగొన్నాడు. మార్టిన్ కూపర్ వైర్ లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థకు ఆద్యుడుగా పేర్కొనవచ్చు. మొట్టమొదటి మొబైల్ కాల్ 1973 ఏప్రిల్ 3వ తేదీన మార్టిన్ కూపర్ న్యూజెర్సీలోని జోయెల్ ఎంజెల అనే ఒక ఉద్యోగికి ఫోన్ చేసాడు. ఇదే మొదటి మొబైల్ కాల్. హ్యాండ్ హెల్డ్ మొబైల్ 1973లో పరిచయం చేయబడింది. మొటొరోలా కంపెనీ దాదాపు దశాబ్దం పాటు విశేష కృషి చేసి, అనేక సాంకేతిక పరమైన అవరోధాలను అధిగమించి, మొదటి కమర్షియల్ సర్వీసుగా 1983లో వినియోగంలోకి తెచ్చింది. వ్యాపార రంగంలోకి అడుగు పెట్టిన మొదటి తరం(1జి) మొబైల్ ఫోన్ ఇదే. మొదటి వైర లెస్ సెల్‌ఫోన్ సుమారు ఒకలో బరువు ఉండేది. సుమారు 23 సెంటీమీటర్ల పొడవు, నాలుగున్నర సెంటీమీటర్ల వెడల్పు కలిగి ఉండేది.

వందల మిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టి, మరో 20 సంవత్సరాలు కృషి చేసి ఎన్నో రకాల సమస్యలను పరిష్కరించిన తర్వాత స్మార్ట్ ఫోన్ తయారైంది. ప్రపంచంలో మొదటి సెల్యులర్ నెట్ వర్క్‌ను జపాన్‌లో 1989లో ప్రారంభించారు. ఇవే మొదటి తరం లేదా 1జి సెల్యులర్ ఫోన్లు. నోకియా మొదటి మొబైల్ ఫోన్ విడుదల చేసి, అప్పట్లో సంచలనం సృష్టించింది. అయితే మొదటి తరం సెల్యులర్ నెట్‌వర్క్, ప్రప్రథమంగా 1983లో అమెరికాలో ప్రారంభించినట్లు తెలుస్తోంది. 1జి మొబైల్ ఫోన్లు 2జికి మార్చబడ్డాయి. మొదటి తరం సాంకేతిక పరికరాలు, ఫోన్లు కొన్ని చోట్ల 2000వ సంవత్సరం వరకు, మరికొన్ని చోట్ల 2010వ సంవత్సరం వరకూ కొనసాగాయి. 2వ తరం లేదా 2జి సెల్యులర్ నెట్ వర్కింగ్ 1991లో ఫిన్లాండ్‌లో జియస్ఎమ్ ప్రమాణంతో వాణిజ్య పరంగా ప్రారంభించబడింది.




1జి, 2జి టెక్నాలజీ ప్రపంచ స్థాయి ప్రమాణాలు కావు. అన్‌లాగ్, డిజిటల్ వ్యవస్థలు రెండూ సిగ్నల్స్‌ను ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి ట్రాన్స్‌మిట్ చేస్తాయి. ఇవి రెండూ ఎలక్ట్రిక్ సిగ్నల్స్ ద్వారా ఆడియో వీడియోలను పంపిస్తాయి. అన్‌లాగ్ సిస్టమ్‌లో శబ్దం స్పష్టంగా వినబడదు. డిజిటల్ సిస్టమ్ ఎలాంటి రణగొణ ధ్వనులు లేని సిగ్నల్స్ చేరవేస్తాయి. గ్లోబల్ సిస్టమ్ ఫర్ మొబైల్ కమ్యూనికేషన్ (జిఎస్ఎమ్) అనేది మొబైల్ కమ్యూనికేషన్ల కోసం ఉపయోగపడే సెల్యులర్ టెక్నాలజీ. ఇది ప్రపంచ వ్యాప్తంగా వినియోగించే అంతర్జాతీయ ప్రమాణాలు గల నెట్‌వర్క్.

2జి తర్వాత తరం 3జి. 3వ తరం నెట్‌వర్క్‌ను 2001వ సంవత్సరం, అక్టోబర్ 1వ తేదీన జపాన్‌లో ప్రారంభించారు. 4జి అనేది నాలుగవ తరం నెట్‌వర్క్‌గా ఇంటర్నేషనల్ టెలీకమ్యూనికేషన్ యూనియన్ చేత పిలవబడిన సెల్యులర్ టెక్నాలజీ. 4జి ఉత్తమ ప్రమాణాలతో ప్రారంభమైన నెట్‌వర్క్. ఇది 2009 డిసెంబరు 14వ తేదీన స్వీడన్ రాజధాని స్టాక్‌హోంలో, నార్వే రాజధాని ఒస్లోలో ప్రారంభమైంది. 1జి తర్వాత తరం జనరేషన్ మొబైల్ ఫోన్లు కొంత బ్యాండ్ విడ్త్ పెంపుదలతో, మెరుగైన వేగం గల నెట్‌వర్క్ సామర్థ్యంతో పని చేస్తున్నాయి. ఇటీవల ప్రారంభమైన 5జి సేవలు అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడ్డ గ్లోబల్ వైర్ లెస్ నెట్‌వర్కును కలిగి ఉన్నాయి.

ప్రపంచంలో పలు దేశాలు ఇప్పటికే 5జి నెట్‌వర్క్ ప్రారంభించిన విషయం విదితమే. మొదటి 5జి సర్వీసులను 2019 ఏప్రిల్‌లో తామే ప్రారంభించామని దక్షిణ కొరియా, అమెరికాలు వాదించుకుంటున్నాయి.

ప్రపంచంలో 70కి పైగా దేశాలు 5జి సేవలను ఆయా దేశాల్లోని పలు నగరాలకు విస్తరింపచేసాయి. వీటిలో దక్షిణ కొరియా, అమెరికా, చైనా, యు.కె.జపాన్, ఫ్రాన్సు, సౌదీ అరేబియా తదితర దేశాలున్నాయి. కొద్ది రోజుల క్రితం భారతదేశం కూడా 5జి సేవలను ప్రారంభించి అగ్ర రాజ్యాల సరసన చేరింది. భారతదేశం 5జి సర్వీసుల విషయంలో అనివార్య కారణాల వల్ల కొంత జాప్యం చేసినప్పటికీ, ఇటీవల ప్రధాని మోడీ ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో ఇండియా మొబైల్ కాంగ్రెస్ సమావేశంలో 5జి సేవలను లాంఛనంగా ప్రారంభించారు. మొదటి దశలో 13 నగరాలు 5జి పరిధిలోకి వచ్చాయి. హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, గాంధీనగర్, జామ్‌నగర్, ముంబై, పూణె, లక్నో, గురుగ్రామ్, చండీగర్‌లకు మొదటి దశలో 5జి సేవలు అందించబడతాయి. రాబోయే కొద్ది కాలంలో 5జి సేవల వలన లక్షలాది కోట్ల ఆదాయం లభిస్తుంది. వివిధ రంగాలు డిజిటలైజ్ కాబోతున్నాయి. రాబోయే సంవత్సరాల్లో భారత్ శీఘ్రగతిన ఆర్థిక ఎదుగుదల సాధిస్తుందని, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి, తలసరి ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ, విద్య, వైద్య, ఆరోగ్య, ఇంజినీరింగ్,




బ్యాంకింగ్ రంగాల్లో విప్లవాత్మక మార్పులొస్తాయని కొంతమంది విశ్లేషకుల అంచనా. వచ్చే అర్థ సంవత్సరంలో భారతదేశంలోని సుమారు 600 నగరాలకు 5జి సేవలను విస్తరించే అవకాశం ఉంది. 2023 నాటికే దేశమంతా 5జి సేవలను కల్పిస్తామని రిలయెన్స్ జియో అధినేత ముఖేష్ అంబానీ ప్రకటించారు. భారత ఎయిర్‌టెల్ కంపెనీ ఢిల్లీ, ముంబై, బెంగళూరు, వారణాసి వంటి 8 నగరాల్లో 5జి సేవలను ప్రారంభించిన విషయం తెలిసిందే. రాబోయే రెండేళ్లలో పల్లె పల్లెకు 5జి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుంది.

ఇప్పటికే పలు కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా 5జి టెక్నాలజీకి అనుగుణంగా సరికొత్త 5జి ఫోన్లను విడుదల చేసాయి. త్వరలోనే 5 జి రిలయెన్స్ ఫోన్లను విడుదల చేస్తామని ఆ సంస్థ తెలిపింది. రిలయెన్స్ జియోకు చెందిన అంబానీ, భారతి ఎయిర్‌టెల్‌కు చెందిన సునీల్ మిట్టల్‌లు 5జి స్పెక్ట్రమ్ వేలంలో ప్రథమ, ద్వితీయ విజేతలుగా మిగిలారు. వీరిరువురూ భారతదేశంలో 5జి సాంకేతిక పరిజ్ఞాన విస్తరణలో విశేష కృషి చేస్తున్నారు. వొడాఫోన్, ఐడియా, అదానీ గ్రూపులు తర్వాత స్థానంలో నిలిచారు. కంప్యూటర్లకు, స్మార్ట్ ఫోన్లకు, టి.వి.లకు 5జి సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపకరిస్తుంది. 4జి సిమ్ వినియోగదారులు 5జికి అప్‌గ్రేడ్ కావాలని కొంతమంది అవసరం లేదని మరికొందరి వాదన. సిమ్‌కార్డు మార్చకుండానే 5జి సేవలను పొందవచ్చు. 5జికి సంబంధించిన అనుకూలతలు, ప్రతికూలతలపై లోతైన, సమగ్రమైన విశ్లేషణ అవసరం.

అనుకూల అంశాలు

1) 5జి టెక్నాలజీ వలన అత్యధిక వేగంతో అంతర్జాల సమాచారం తెలుసుకోవచ్చు.

2) ఇంటర్నెట్ వేగం పెరగడం వలన డౌన్ లోడింగ్ సామర్థ్యం పెరుగుతుంది.

3) 4జి కంటే పది రెట్ల వేగంతో వీడియోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

4) సంభాషణల్లో స్పష్టత, అవాంతరాలు లేని బ్రౌజింగ్ 5జితో సాధ్యమవుతుంది.

➡ 4జి నెట్‌వర్క్‌లో ఓవర్ లోడింగ్ సమస్యల వలన డేటా యాక్సెస్‌లో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. 5జి వీటికి పరిష్కారం లభిస్తుంది.

➡ 4జి కంటే 100 రెట్ల అధిక సామర్థ్యం 5జి సొంతం. బ్యాండ్ విడ్త్ పెరగడం వలన డేటా ట్రాన్స్ ఫర్ చాలా సులభం.

➡ 4జి ఎల్‌టిఈ నెట్‌వర్క్‌లో డౌన్‌లోడ్ వేగం గరిష్ఠంగా సెకనుకు ఒక గిగా బైట్ కాగా, 5జిలో 20 గిగా బైట్ల వరకు ఉంటుంది.

➡ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్‌లకు 5జి ఊతం ఇవ్వగలదు. కొత్త అప్లికేషన్లకు మరిన్ని అవకాశాలు కలుగుతాయి. విస్తృతమైన మెరుగైన అవకాశాలు, సర్వీసులు 5జితో సుసాధ్యం.

➡ 5వ తరం టెక్నాలజీ అన్ని వయసుల, వృత్తుల వారికి ఎంతగానో ఉపకరిస్తుంది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, వైద్యులకు, ఇంజినీర్లకు, ప్రభుత్వ సంస్థలకు బహుళ ప్రయోజనకారి 5జి.

➡ ఎక్కువ రెసల్యూషన్‌తో టెక్నాలజీని ఒకే ప్లాట్ ఫారంపైకి తీసుకురావడం అత్యంత ప్రయోజనకరం.

➡ అత్యంత ప్రభావవంతంగా అంతరాయం లేని, స్థిరమైన సేవలకు 5జి పరిజ్ఞానం ఉపయోగపడుతుంది.

➡ హ్యాండ్ సెట్లతో, పిసిలను కంట్రోల్ చేయగలగడం అత్యంత వేగంగా పరిశోధన, పరిశీలన చేయగలగడం, నేరాల రేటు తగ్గించగలడం 5జి వలన సాధ్యమవుతుంది.

➡ భూకంపాలను, సునామీలను ఇతర ప్రకృతి విపత్తులను ముందుగా పసిగట్టడం, వాతావరణ మార్పులను వేగవంతంగా తెలుసుకోవడం 5జితో సాధ్యం.

➡ నిరుద్యోగులు తమ కాళ్లపై తాము నిలబడే ధైర్యాన్ని కల్పిస్తున్న సామాజిక మాధ్యమాలు 5జి ప్రభావంతో మరింత ఊపందుకునే అవకాశాలున్నాయి.

### ప్రతికూల అంశాలు

➡ రిమోట్ ప్రాంతాలకు 5జి లభ్యత అనుమానాస్పదం. ప్రపంచ వ్యాప్తంగా 5జి నెట్ వర్క్ కవరేజ్ చేయాలనే ఉద్దేశం ఉన్నప్పటికీ రెండు మూడేండ్ల వరకు ప్రపంచంలోని ప్రధాన నగరాలకు తప్ప మిగతా ప్రపంచానికి 5జి లభ్యత కుదరకపోవచ్చు.

➡ 5జి టెక్నాలజీ వలన మొబైల్ బ్యాటరీ లైఫ్ తగ్గిపోయే అవకాశాలున్నాయని; ఫోన్లు త్వరగా వేడెక్కడం వంటి సమస్యలు రావొచ్చని కొన్ని కథనాలు వినిపిస్తున్నాయి. ఇది నిజమైతేగనుక బ్యాటరీ డ్రయన్‌ను అరికట్టే సూచనలు చేయాలి.

➡ 5జి యూజర్లకు తమ ఫోన్లకు మెరుగైన బ్యాటరీ, బ్యాటరీ సామర్థ్యడం అవసరం.

➡ డౌన్ లోడింగ్ సామర్థ్యం పెరిగినా, అప్‌లోడ్ సామర్థ్యం తక్కువని కొందరి వాదన. 5జికి కావలసిన ఫైబర్ నెట్ వర్క్ ఏర్పాటుకు చాలా సమయం పట్టవచ్చు.

➡ విమానాలకు 5జి సిగ్నల్స్ వలన ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం కనుగొనాలి. 4జి ఎల్‌టిఈల మాదిరిగా 5జి పూర్తిగా వినియోగంలోకి వచ్చే అవకాశం లేదనే వాదన ఎంతవరకు నిజమో తేలాలి.

➡ 5జి వలన భవిష్యతరాలకు ఆరోగ్య, పర్యావరణ సమస్యలు తలెత్తగలవనే అనుమానాలున్నాయి. అయితే మారిన




పరిజ్ఞానం వలన తక్కువ రిస్క్ ఉంటుందని కొందరి అభిప్రాయం.

➡ పిచ్చుకల పైన, తేనేటీగల పైన 5జి రేడియేషన్ ప్రభావం గురించి నిజానిజాలు తెలియాలి. ప్రజల అనుమానాలకు, అపోహలకు సాంకేతిక రంగ నిపుణులు సమాధానం చెప్పాలి.

➡ 5జి కనెక్షన్‌కు గోప్యత విషయంలో నెలకొన్న అనుమానాలు నివృత్తి చేయాలి.

➡ 5జితో డేటా చౌర్యం మరింత సులభం అవుతుందన్న అభిప్రాయాలున్నాయి. హ్యాంకర్ల నుండి మొబైల్ యూజర్లకు భద్రత లభించాలి.

➡ 5జి వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఎదురయ్యే పలు సమస్యలకు పరిష్కారం అన్వేషించాలి.

➡ 5జి వలన సైబర్ సెక్యూరిటీ, ప్రైవసీకి నష్టం వాటిల్లవచ్చనే ఆందోళనలో నిజమెంతో తెలియాలి.

➡ 5జి పట్ల మొబైల్ వినియోగదారుల్లో కొంత అభద్రత నెలకొన్న మాట వాస్తవం. 5జి పట్ల నమ్మకాన్ని పెంచాలి. నెట్‌వర్క్ భద్రతకు తగిన చర్యలు అవసరం.



➡ సైబర్ క్రైమ్ చట్టాలకు మరింత పదును పెట్టాలి. వినియోగదారులకు 5జి సాంకేతిక పరిజ్ఞానం పైన, మొబైల్ వినియోగం పట్ల అవగాహన పెంచాలి.

➡ 5జి ప్రతికూలతలపై స్పష్టమైన సమాచారం కావాలి.

ఏదైనా ఒక నూతన ఆవిష్కరణ జరిగినప్పుడు అనుకూలతలతో పాటు కొన్ని ప్రతికూల అంశాలు కూడా చోటు చేసుకుంటాయి. వీటిని అధిగమిస్తూ ముందుకు సాగడం, మరింత నాణ్యమైన సేవలందించడానికి సరికొత్త టెక్నాలజీ వైపు దృష్టి సారించడం 'సైన్స్' ప్రధాన లక్ష్యం. మానవాళి శ్రేయస్సు కోసం సైన్స్ ఫలితాలు, సాంకేతిక నైపుణ్యం ఉపయోగపడాలి. ఏది ఏమైనా సాంకేతిక పరిజ్ఞానం 'ఇంతింతై వటుడింతై..” అన్నట్టుగా అత్యంత వేగంగా పరుగెడుగోతుంది. 5జి పరిజ్ఞానం ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని విచక్షణతో వినియోగించాలి. ముందు తరాలకు ముందు చూపుతో చక్కని భవిష్యత్తును అందించాలి. ప్రపంచాన్ని, దేశాన్ని సరైన దారిలో నడిపించడానికి టెక్నాలజీని వినియోగించాలి. మెరుగైన ఉపాధి అవకాశాలకు, నైపుణ్యాలకు, మానవీయ విలువలకు, నైతికతకు మారిన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడాలి. మంచి కంటే చెడు అత్యధిక వేగంతో పయనిస్తున్న వర్తమానంలో సాంకేతిక పరిజ్ఞానానికి అభివృద్ధితో పాటు నైతిక విలువలు జోడించాలి.

5జితో పెరిగిన సాంకేతిక పరిజ్ఞాన వేగాన్ని సద్వినియోగం చేసుకోవాలి. 5జి డిజిటల్ ప్రపంచంలోకి ఘనంగా అడుగులు వేద్దాం! 5జి అనుభవాలను ఆస్వాదిస్తూ నిర్మాణాత్మక ఆలోచనలతో ముందుకు సాగుదాం!! ❑

# ఈ వారం కవిత్వం



## దర్వాజా

దర్వాజా! ఇప్పుడు ఎక్కడ చూసినా
మనిషికి మనిషికి మధ్యన
కనిపించని మాయ పొరల తెర!
దర్వాజా! నీదెంతటి భాగ్యమో!
నువ్వు ఒకరికి కాపలా అయితే
నీ ముందు మరొకరు కాపలా!
దర్వాజా! మనుషుల మధ్య ఉన్నందున
నీ మనసు ఇరుకై జతగా ఉండక
మనిషిలెక్క ఒంటి రెక్కైనవు!
దర్వాజా! నీదెంతటి స్వామి భక్తియో
కనురెప్ప చందము
ఇంటిని వొంటివలె కాపాడుతున్నవు!
దర్వాజా! బడుల, గుడుల, ఏలుబడుల
నియమాలు పెట్టుకొని,
సమయపాలన చేస్తున్నావు!
దర్వాజా! నీది ఎంతటి విశ్వాసమో!
విసుగు లేకుండా, వినయంగా
స్వాగత, వీడ్కోలులు పలుకుతావు!
దర్వాజా! నీది ఎంతటి పుణ్యమో
నీ ముందు భక్తుల నిరీక్షణలు
ఆ దైవాన్ని దర్శించే క్షణాల కోసం!దర్వాజా! నీవు
బోర్డర్లో సైనికుని లెక్క!
శనిశింగణాపూర్ ప్రజల లెక్క
నీ భరోసాతో హాయిగా నిద్రిస్తున్నాము.

**- బి.బక్కారెడ్డి**


---

## ఓ నిజం తెలిసేదాకా..

రూపాన్ని చూస్తే మామూలే
రాళ్లు మట్టిని కలబోసుకొని
చింపిరి చింపిరిగా పిచ్చిమొక్కలు
తీగలతో చిందర వందరగా
పుట్టలతో గుట్టలతో ఎగుడు
దిగుడుగా
అస్తవ్యస్తంగా..
జడివాన కోత పెట్టినా
వడగాడ్పుల సెగ పగ పూనినా
చలిగాలులకు వణుకు పుట్టినా
మౌనంగా తల వంచే
అమాయకం
అజ్ఞానాన్ని నటిస్తూ
తేమను... నెర్రెను
దువ్వను.... దమ్మును
భరించే సహనం అసహనమే.
ఒక అవసరం నడిసొచ్చి
ఒక ఆలోచన తడిసి పాకి
ఒక తన్మకం తగిలి తాకి
పులకించిన మేనిలో తలపులూరి
పలకరించే లోతులో మనసు
మెరిసి
ఓ నిజం తెలిసేదాక ఇంతే.

**- చందలూరి నారాయణరావు**

## బాగుంటుందేమో!



పేరుకుపోయిన
జ్ఞానాలు,
జ్ఞాపకాలు!
పెరిగిపోయిన
బంధాలు,
రాగాలు!
గణాంకాలు తెలిసేలోగా
గుణింతాలు
అయ్యేలోపు
కాలం కదిలిపోతోంది!
బంధం
జరిగిపోతోంది!
వింత మలుపులు
తిరుగుతూ
విచిత్రంగా గమనం
సాగుతుంది!
మలుపు
దాటేవేళ
మరులు
పడుతూ మథనం పుడుతుంది.
పాఠం అయ్యేవేళకు పరీక్ష వుండదు
పరీక్ష రాసే వేళకు పఠనం అవ్వదు!
వసంతాన్ని అర్థవంతంగా
ఆస్వాదించేలోపు
శిశిరం స్వాగత సత్కారాలు
పలుకుతుంది!
ఒక జీవితం అర్థం కావాలంటే
ఒక జీవిత కాలం సరిపోదేమో!
అర్థం అయిందన్న జీవితంలో
ఇక మిగులు కాలం ఉండదేమో!
చదివేసిన తత్వాలు
చవిచూసిన అనుభవాలు
అక్కరకు రాని బలాలు
అభ్యసించిన విద్యలు/ వచ్చే జీవితానికి
పోగేసిన ధరావత్తుగా
ఉంటే బాగుంటుందేమో!
గణించిన సముపార్జనతో
మొదలైతే బాగుంటుందేమో!

**- ఉషారం**


# త్రీ-ఇన్-వన్



పన్నెండు కథలు, మూడు కవితా కథానికలు, తొమ్మిది కవితలు పొందుపరిచిన పోతాప్రగడ ఉమాదేవి విరచిత సంకలనం 'సాహితీ సుమాలు', 'త్రీఇన్‌వన్' అన్నమాట. వరకట్న పిశాచి ఓ అమాయకురాలి నిండు ప్రాణాలను బలిగొన్న హృద్యమైన కథ 'తెల్లారిపోయింది'. ఇంట్లో ప్రేమానురాగాలు దొరకని ఓ చిన్నారి మనస్సు ఎంతగా గాయపడుతుందో..స్వాంతన కోసం ఎంతగా పరితపిస్తుందో కళ్లకు కట్టిన కథ 'నల్ల కలువ'. ఈ కథలోని మానసిక విశ్లేషణ చదివి తీరాల్సిందే. రచయిత్రి తన కథలన్నింటిలో సృష్టించిన పాత్రలు మన చుట్టు తిరుగాడుతున్నట్టే వుంటాయి. మధ్యతరగతి జీవితాలను వాస్తవికంగా చిత్రించిన తీరు అబ్బురపరుస్తుంది. 'సీతాలు నవ్వింది', 'మార్పు', 'మంటలు' కవితాత్మకంగా తీర్చిదిద్దిన కథానికలు. ఉమాదేవి రచనా ప్రతిభకు తార్కాణాలు. 'కవిత కళాత్మకమైన సత్యం వంటిది. దాన్ని పలికించేది జనసౌభాగ్యం కోసమైనప్పుడే!' జనహితం కోసం రాసిందే అసలైన కవిత్వమని కవయిత్రి భావం. 'కాలం గమనాన్ని సూచిస్తుంది/ కలం జీవన గమ్యాన్ని నిర్దేశిస్తుంది' వంటి తాత్విక పంక్తులు ఉమాదేవి కవితల్లో గమనించవచ్చు. 'ఆయుధాలు కావలసిన/ నిర్భయ నివేదికలు, గృహహింస చట్టాలు/ అలంకారాలుగా మిగిలిపోతున్నాయి' యిదీ కవయిత్రి నిర్వేదం. ఈ పరిస్థితులు మారాల్సిన అవసరం ఎంతయినా వుందని ఆమె అభిప్రాయం. **(ఉమాదేవి సాహితీ సుమాలు, రచన: పోతాప్రగడ ఉమాదేవి, వెల: రూ150, ప్రతులకు: బ్లాక్-1, ఫ్లాట్-సి, కలింగకాలనీ, కె.కె.నగర్, చెన్నై-600078)**

**- రమణ వెలమకన్ని**

# కాళిదాసు నాటకం 'భారతీ విలాసము'



'కాళిదాసు హృదయావిష్కారం' అంటూ ప్రముఖ సినీనటులు తనికెళ్ల భరణి అనిర్వచనీయమైన ప్రస్థానము అంటూ తెలుగుమల్లి సంపాదకులు (ఆస్ట్రేలియా) మల్లికేశ్వరరావు కొంచాడ చక్కటి అభిప్రాయాలు రాసారు. కాళిదాసు ప్రతిభను తెలుసుకోవాలనుకొనే వారికి ఈ నాటకం ఒక చక్కటి పరిచయద్వారం. కాళిదాసు కుమార సంభవం. మేఘసందేశం, రఘువంశం, ఋతుసంహారం లాంటి కావ్యాలు అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్నిమిత్రం, విక్రమోర్వశీయంలాంటి నాటకాలు రాసారు. ఇంకా శ్యామలాదండకం లఘుస్తవము, దుర్గా, కాళీస్తుతులు రాసారు. భోజన ఆస్థాన కవిగా వున్నాడు. కాళిదాసు 1వ శతాబ్దం వాడని 10వ శతాబ్దివాడని అంటారు. మొత్తం 23 రంగాల తో కాళిదాసు చరిత్ర నాటకం వుంది.

మోహినీ, సూత్రధారులతో మొదటి అంకం ప్రారంభమై భోజనాలు ఆస్థానం దండి, కాళిదాసు, భవభూతి, శంకర కవి. కొలువు చేసిన సభ 23వ రంగంతో నాటకం ముగుస్తుంది.

18వ రంగంలో వేశ్యావాటికలో నృత్యప్రదర్శనం ఏర్పాటు చేసారు. ఆరంగంలో సామాన్యుని వేషంలో భోజుడు (రాజు) ఉండటం దృశ్యీకరణతో కొన్ని పాత్రలు పెట్టి సంభాషణలు రాస్తే నాటకంలో మరింత బిగువు ఉండేది.

శ్లోకాలు సందర్భోచితంగానే ఉన్నాయి.

**(భారతీ విలాసము, తూములూరి (వెంకటసుబ్రహ్మణ్యం)శాస్త్రి, వెల: రూ150, ప్రతులకు: జె.వి.పబ్లికేషన్స్, హైదరాబాద్)**

**- తంగిరాల చక్రవర్తి**

## పుస్తక సమీక్ష

ఈ నవల రచయిత్రి కుమ్మమూరి సుబ్బాయమ్మ 81 ఏళ్ల వరిష్ట సాహితీవేత్త. కవిత్వం కథ, నవలారచన నాటికలు వేయించుట వీరి అభిరుచి. అధ్యాపక వృత్తిలో భాగంగా వందలకొద్ది భావిభారత పౌరులను తీర్చిదిద్దిన ఆదర్శ ఉపాధ్యాయురాలు. వయసుతో పోటీపడుతూ, పడుచువారితో సమానంగా రాస్తారు. పలు సాంస్కృతిక కార్యక్రమా

# ఎదురీత గుండెకోత



ల్లో చురుకైన పాత్ర పోషిస్తారు. పలుపుస్తకాలు ప్రచురించారు. స్త్రీల జీవితాలు ఎన్నటికీ ఎదురీతేనని, బాల్యం కౌమారం, యవ్వనం గార్హస్యం, వృద్ధాప్యంలాంటి ప్రతీదశలోనూ స్త్రీ ఎన్నో విపత్కార పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని, అన్నింటినీ ఆత్మస్థైర్యంతో గుండె నిబ్బరంతో ఎదుర్కోవాలని ఈ నవలలో సుశీల పాత్ర ద్వారా రచయిత్రి వివరించారు. ఆది నుంచి అందరు ఉన్నా సుశీలది ఒంటరి పోరాటపు బ్రతుకు అవుతుంది. జన్మనిచ్చిన తల్లిదండ్రులు బంధువులు, తోటి విద్యార్థులు అధ్యాపకులు, పెళ్లి అయ్యాక అత్తామామలు, చివరకు భర్త కూడా సుశీలను, శారీరక మానసిక హింసలకు గురి చేస్తారు. అయినా, సుశీలధైర్యం వీడక ఎదురైన ప్రతిఘటనకూ ఎదురీదుతూ టీచరు అవుతుంది. కోడలుతో విభేదించి ఒంటరి బ్రతుకులో మృగ్యమైన సంతృప్తిని వెదుకుతూ కాలం గడుపుతుంది సుశీల. ఎక్కడా అసహజం లేకుండా, దైవోపహతురాలైన సుశీల జీవితం యాదార్థసంఘటనల సమాహారమా? అనిపించేంత సహజంగా చిత్రించిన ఈ నవలలో అడుగడుగునా, కుమ్మమూరి వారి ప్రతిభ ద్యోతక మవుతుంది. **(ఎదురీత, రచన: కుమ్మమూరి సుబ్బాయమ్మ, వెల: రూ100, ప్రతులకు: ఇ.నెం. 11-13-154, అల్కాపూరి, హైదరాబాద్)** **- కూర చిదంబరం**

'చీకటి రాత్రిలో ఉదయించిన సూర్యుడు సుదీర్ఘ స్వప్న సుమధుర తెలంగాణ కావ్యమైంది' కోడం పవన్‌కుమార్ పాత్రికేయ కవిగా, తెలంగాణ స్వరాష్ట్రాన్ని ప్రేమించారు. జూన్ 2, 2014 కవితాసంపుటి శీర్షికగా 104 కవితలతో వెలువరించి కొత్తలోకాన్ని ఆవిష్కరించారు. కవి పవన్

# పవన్ కుమార్ అద్భుత కవితా సంపుటి



కుమార్ 'పుట్టెడు దుఃఖపుముఖాన్ని కొంగున దాచిన తెలంగాణ తల్లి పునర్నిర్మాణాన్ని ఆకాంక్షించారు. ఈ సంపుటిలో వైవిధ్యభరితమైన కవితలు హృదయాన్ని సూటిగా స్పృశిస్తున్నాయి. 'మా ఊరి చెరువు' కవితలో 'చెమ్మగిల్లిన చెరువు కన్నొకటి కజ్జల చెంత ఆనవాలుగా మిగిలింది' అంటారు. 'నిత్యం కన్నీటి వెతలతో సాగు చేయలేక, మట్టిని చీల్చుకొని పోరుకు సిద్ధమైన మట్టిపాదాల మహాయాత్రను ఆర్తనాదంగా వినిపింప చేస్తారు. 'వాలిన సీతాకోక చిలుక బరువుకు నేలమీదికి పువ్వు వాలిపోయింది' అంటారు ప్రకృతిని ప్రేమించే హృదయగత మృదుస్పర్శతో. ఆకలి తీరేదారి దొరక్క తికమకపడుతున్న జీవుల వేదనను 'ఆకలి' కవితలో స్పందింపచేసారు. సమైక్యతకు సంకేతంగా 'ఓ దీపాన్ని వెలిగించు', 'మనిషి' కవితలో 'నినాదమైన గొంతుక నిర్బంధాన్ని ఛేదిస్తుంది' అంటూ 'పుడమితల్లి నుదుటి మీద సూర్యతిలకం దిద్దుతాడు' అంటారు. **(కోడం పవన్‌కుమార్ కవిత్వం జూన్ 2, 2014, రచన: కోడం పవన్‌కుమార్, వెల: రూ 125, ప్రతులకు: లయ పబ్లికేషన్స్, ఇ.నెం.3-12-110/బి, గణేశ్‌నగర్, రామాంతాపూర్, హైదరాబాద్)** **- ఎర్రమిల్లి**



# పర్యాటకుల మనసు దోచే సతారా..

**వర్షాకాలంలో అనేక మంది ప్రకృతి అందాలను చూసేందుకు వివిధ పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ఇష్టపడుతుంటారు. మహారాష్ట్రలో అందమైన ప్రకృతి రమణీయమైన జలపాతాలు, పచ్చని కొండలు, లోయలు.. ఇలా అనేకం ఉన్నాయి.**

అయితే వీటిలో సాతారా జిల్లాలోని ఓ అందమైన ప్రాంతం.. జిల్లాకు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న 'కాస్ పీఠభూమి'. ఒక అసాధారణమైన బయోస్ఫియర్, స్థానికులతో పాటు పర్యాటకులను ఇది విశేషంగా ఆకర్షిస్తోంది. ఇక్కడ కేవలం ఆగస్టు, సెప్టెంబరు మధ్యలో దాదాపు 300 రకాలకు పైగా వివిధ రకాలకు చెందిన రంగు రంగుల పూలు పర్యాటలకు కనువిందు చేస్తాయి. కేవలం ఈ రెండు నెలల్లో ఈ ప్రాంతాన్ని సందర్శించడానికి పర్యాటకులు తండోపతండాలుగా దేశ, విదేశాల నుంచి తరలివస్తారు.

మరెక్కడా చూడలేని రకరకాల పక్షులను ఈ ప్రాంతంలో చూసేందుకు ఇదే మంచి అవకాశం.

పర్వత శిఖరాలపైన కనిపించే ఈ పీఠభూములు హెలిప్యాడ్‌లను పోలి ఉంటాయి. రుతుపవనాలు ప్రవేశించి వర్షాలు మొదలయ్యేసరికి వివిధ రకాల గడ్డి పెరిగి, కొండలన్నీ పచ్చటి తివాచీ పరిచినట్లు కనిపిస్తాయి. దీంతో ఆ ప్రదేశానికి రంగులు వేసినట్లుగా పచ్చిక బయళ్లు, వాటిపై రంగు రంగుల బొట్లు పెట్టినట్లుగా వివిద రకాల పూలు చూడముచ్చటగా కనిపిస్తాయి. పసుపు రంగు, ఇతర రంగుల పుష్పాలతో రంగు రంగు తివాచీలు పరచి మనకు స్వాగతం పలుకుతున్నట్లు అనిపిస్తుంది. ఈ ప్రకృతి దృశ్యాలను తిలకించేందుకు, పలు రకాల పుష్పాలను, పక్షులను అధ్యయనం చేసేందుకు వృక్ష, జంతు శాస్త్ర నిపుణులు, ప్రకృతి ప్రేమికులు, ఫొటోగ్రఫీ ప్రియులు, పర్యాటకులు ప్రపంచం నలుమూలల నుంచి లక్షలాదిగా ఈ ప్రదేశానికి తరలివస్తుంటారు. పర్వత ప్రాంతం ఈ రెండు నెలల్లో పర్యాటకుల వాహనాలతో కిక్కిరిపోతుంది. అయితే ఈ పీఠభూమికి కాలినడరక మాత్రమే చేరాల్సి ఉంటుంది. ఈ ప్రకృతిని ఆస్వాదించిన పర్యాటకులకు ఈ ప్రదేశం తమ జీవితంలో ఒక మధురానుభూతిగా నిలిచిపోతుంది.

అత్యద్భుత ప్రయాణం..

సతారా నుంచి కాస్‌కు వెళ్లే మార్గం కొంత ఇరుకుగా ఉన్నప్పటికీ పర్వతాల పైకి వెళ్తున్నంతసేపు పర్యాటకులను తాకే చల్లటి గాలులు



మొత్తం శ్రమను దూరం చేస్తాయి. ముందుకు సాగుతున్నంతసేపూ ఎన్నో అద్భుతాలను, మనోహరమైన ప్రకృతి దృశ్యాలను కెమెరాల్లో బంధించవచ్చు. ముఖ్యంగా ప్లాస్టిక్‌కు సంబంధించిన ఎలాంటి వ్యర్థ పదార్థాలు ఇక్కడ మచ్చుకైనా కనిపించవు. దీంతో వాతావరణం మరింత ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడికి వచ్చిన సందర్శకులు పూలను, మొక్కలను తెంచకపోవడం మరో విశేషం. సంవత్సరంలో ఒక్కసారి వచ్చే ఈ వింత లోకానికి చూడడానికి పర్యాటకులు ఉత్సాహపడుతుంటారు.




**చూడాల్సిన ప్రాంతాలు**

కాస్‌లేక్ కాస్ పీఠభూమి సముద్ర మట్టానికి 3,725 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఈ పీఠభూమి సహ్యాద్రి కొండల మధ్య గిన్నె ఆకారంలో కనిపిస్తుంది. కొయనా ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా కాస్ లేక్ ఏర్పడింది. సతారా పట్టణానికి తాగునీటిని ఈ లేక్ నుంచి సరఫరా చేస్తున్నారు. ఈ సరస్సు ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. స్వచ్ఛతలో ఈ లేక్ దేశంలోనే నెంబర్ వన్ అని చెప్పవచ్చు. ఇక్కడ బోటింగ్ ఓ అద్భుత, చిరస్మరణీయ అనుభూతిని కలిగిస్తుంది. ఈ ప్రాంతం మొక్కలకు, వన్యజీవులకు



అనుకూలంగా నిలుస్తుంది. భూలోకంలో స్వర్గాన్ని అనుభవించాలంటే జీవితంలో ఒక్కసారైనా ఈ ప్రదేశాన్ని సదర్శించాల్సిందే.

**చల్కేవాడి**

వందలాది గాలిమరలు ఇక్కడ పర్వతాలపై మనకు టాటా చెబుతూ వీడ్కోలు పలుకుతుంటాయి. ఈ దృశ్యాలను చిత్రీకరించేందుకు పలు సినిమా షూటింగులు ఇక్కడ జరుగుతుంటాయి. ఈ గాలి మరల ద్వారా ఇక్కడ విద్యుచ్ఛక్తిని తయారు చేస్తున్నారు. అందుకే సతారా జిల్లాను 'డిస్ట్రిక్ట్ ఆఫ్ పవర్'గా పిలుస్తున్నారు. చల్కేవాడి పవన నిలయంగా చెప్పవచ్చు.



నైసర్గ్ ఆర్గానిక్ ఫార్మ్ సతారాకు చెందిన శిందే ఈ ఆర్గానిక్ ఫామ్‌ను నడుపుతున్నారు. ఔషధ గుణాలు కలిగిన సర్పగంధ, ఇన్సులిన్, తులసి లాంటి వివిధ మొక్కలను ఇక్కడ పెంచుతున్నారు.

తప్పనిసరిగా చూడాల్సిన మరో సందర్శనీయ స్థలం సజ్జన్‌ఘడ్ కోట.


తోసేఘర్ జలపాతం సతారా నుంచి సుమారు ఇరవై కి.మీ. దూరంలో ఈ వాటర్ ఫాల్స్ ఉన్నాయి. ఈ వాటర్ ఫాల్స్ వెయ్యి అడుగుల పైనుంచి కిందున్న లోయలోని పడుతుంటాయి. పర్యాటకులకు ఈ దృశ్యం అద్భుతంగా కనిపిస్తుంది. వేలాది మంది పర్యాటకులు ఈ జలపాతాలను చూడడానికి దేశ నలుమూలల నుంచి వస్తుంటారు. వాటర్ ఫాల్స్‌కు ఎదురుగా ఉన్న లోయ పైన ఒక ప్లాట్‌ఫాంను నిర్మించడం వల్ల ఈ జలపాతాలను దగ్గరగా చూసేందుకు అవకాశం ఉంది. అయితే ఇక్కడ ఎటువంటి సాహస కృత్యాలు చేయకూడదు. ఇక్కడి ప్రకృతి అందాలు పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. ❑



కథ

# మంచికి మంచి

సత్యేంద్ర చాలా నిజాయితీపరుడు. ప్రతి రోజూ ఏదో ఒక మంచి పని చేస్తూనే ఉంటాడు. మంచికి మంచి జరుగుతోందని అతని ప్రగాఢ విశ్వాసం. సత్యేంద్ర భార్య పేరు ఐరావళి. ఆ దంపతులకు ఇద్దరు సంతానం. సత్యేంద్ర కాయకష్టం చేసుకుని జీవనం సాగించేవాడు. ఒక సందర్భంలో అతనికి పని దొరక్కపోవడంతో ఆ కుటుంబం అడపా దడపా పస్తులుండవలసి వచ్చింది. పనికోసం తిరుగుతున్న సత్యేంద్రకు ఒక మిత్రుడు కలిసి ఒక వలను ఇచ్చాడు.



"సత్యేంద్రా! ఈ వలను నీ చేత్తో నదిలో విసురు. అందులో ఎన్ని చేపలు పడినా నువ్వే తీసుకుని అమ్ముకో. వచ్చిన డబ్బుతో నీ కుటుంబ సభ్యుల కోసం మంచి ఆహారాన్ని తీసుకుని వెళ్లు" అన్నాడు సత్యేంద్ర మిత్రుడు.

సత్యేంద్ర నదిలో వల విసిరాడు. అందులో రెండు పెద్ద చేపలు పడ్డాయి. అతను ఆనందంగా వాటిని తీసుకుని వెళ్లి అమ్మి, వచ్చిన ఆ డబ్బుతో భార్యా, బిడ్డలకు మంచి ఆహారాన్ని కొని ఇంటికి బయలుదేరాడు. దారిలో ఒక మహిళ దీనంగా ఏడుస్తూ కనపడింది.

"ఎందుకు ఏడుస్తున్నావు?" ఆమెను ప్రశ్నించాడు సత్యేంద్ర.

అందుకు ఇమె బదులిస్తూ "మాది బాగా బతికిన కుటుంబం. ఇటీవలే నా భర్త మరణించాడు. నాకు ఒక కుమారుడు. మమ్మల్ని ఆదుకునే నాథుడే కరువయ్యారు. నేను, నా బిడ్డ గత రెండు రోజులుగా ఏమీ తినలేదు" అంటూ విలపించింది ఆ మహిళ.

ఈ మాటలు వినగానే సత్యేంద్ర మనస్సు కరిగిపోయింది. ఇంటికి తీసుకుని వెళుతున్న ఆహార పదార్థాల సంచిని ఆ మహిళకు ఇచ్చి తినమని ఇంటిముఖం పట్టాడు. ఉపకారమైతే చేశాడు కానీ తన భార్యా బిడ్డల పరిస్థితి ఏమిటి? అనే ఆలోచనలో పడ్డాడు. మంచికి మంచే జరుగుతుందని సత్యేంద్ర విశ్వసిస్తాడు. అంతా పైవాడి దయ అని అనుకుంటూ ఇంటికి వెళ్లాడు.

సత్యేంద్ర ఇంటికి వెళ్లేటప్పటికి అక్కడ చాలా మంది గుమిగూడి ఉన్నారు. "విషయమేమిటని?" సత్యేంద్ర అడిగాడు.

జనం మధ్యన ఉన్న ఒక పెద్ద మనిషి మాట్లాడుతూ "మీరేనా సత్యేంద్ర?" అని ప్రశ్నించాడు.

"అవును" అని బదులిచ్చాడు.

"మా నాన్న పదేళ్ల క్రితం మీ నాన్న వద్ద పది లక్షలు అప్పుగా తీసుకున్నాడట. ఆ అప్పును తీర్చమని చనిపోయే ముందు నాకు చెప్పాడు. అయితే నేను విదేశాల్లో స్థిరపడటం వల్ల ఆ అప్పు తీర్చలేకపోయాను. ఇప్పుడు తీర్చడానికి వచ్చాను" అంటూ పది లక్షల రూపాయలను సత్యేంద్ర చేతిలో పెట్టాడు.

సతేంద్ర అవాక్కయ్యాడు. తాను చేసే మంచి పనులకు ఇది ప్రతిఫలమని భావించాడు. ఆ డబ్బుతో వ్యాపారం మొదలుపెట్టి చాలా డబ్బును గడించాడు. అయినప్పటికీ అతనిలో ఎటువంటి గర్వం పెరగలేదు. ఎప్పటిమాదిరి తనకు చేతనైన సాయం పేదలకు అందిస్తూ మంచికి మంచి జరుగుతోందని ప్రతి ఒక్కరూ నమ్మేలా జీవనం కొనసాగించాడు.

**- షేక్ అబ్దుల్ హాకీం జాని**





## బాలగేయం

### మళ్లీ బడిబాట



పండుగ సెలవులు
అయిపోయాయి
మళ్లీ బడి తలుపులు
తెరచుకున్నాయ్
హాయిగా బడిబాట
పట్టాం
కరోనాతో సెలవులంటే
భయం వచ్చే..
ఆన్‌లైన్ తరగతులంటే
మరింత టెన్షన్
వద్దు..వద్దు..
ఆరోజులే మాకొద్దు..
బడికెళ్లి చదువుకోవడమే
మాకిష్టం
స్కూల్‌గ్రౌండ్‌లో
ఆడుకోవడమంటే
మరింత ఇష్టం
స్నేహితులతో
కలసిమెలసి ఉంటేనే
మాకిష్టం..

**- సండె డెస్క్**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.అంకిత్,** హనుమకొండ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. చెట్లకు కూడా పంచేంద్రియాలు ఉంటాయా?

**జవాబు: అంకిత్!** చెట్లు, చేమల విషయంలో పరిశీలిస్తే చెట్లు కాంతి, స్పర్శ అనే రెండు ఇంద్రియ జ్ఞానాలతో బతికేస్తుంటాయి. మనిషి మాత్రం ఈ రెండింటితో పాటు కాంతిలోని తేడాలను కూడా గుర్తించగలడు. వాటి ద్వారా వస్తువులను, వ్యక్తుల రూపురేఖలను గుర్తించగలుగుతాడు. శబ్దాలను వినగలగడంతో పాటు, గొంతు స్వరాలను గుర్తించడం, సంగీతం ఆస్వాదించడం, సంక్లిష్టమైన రసాయన మిశ్రమాలను వాసన చూడడం చేయగలడు. అదే సమయంలో నిర్దిష్ట రసాయనాల మిశ్రమాన్ని ఐస్‌క్రీమ్ అనీ, కాఫీ అని వేరు వేరుగా చేసి గుర్తిస్తాడు. శరీర అవయవాల ద్వారా అందుకునే సంకేతాలకు మెదడు చేర్చే అదనపు విలువే 'ఇంద్రియ జ్ఞానం' అని అర్థమవుతుంది. మనకు మాత్రమే గల పంచేంద్రియాలకు జ్ఞాపకశక్తి, అనుభవాలు తోడైతేనే సమగ్రంగా ఇంద్రియ జ్ఞానం అలవడుతుంది.

**- ఎస్.కావ్య,** బెంగళూరు

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ఎడారుల విస్తరణను ఆపివేయడానికి మార్గం ఉందా?

**జవాబు: కావ్య!** ఎటువైపు చూసినా ఇసుకరేణువులతో కనిపించే ఎడారి ఏడాదికి కనీసం ఆరు కిలోమీటర్లు విస్తరిస్తుందని నిపుణుల అంచనా. మన దేశంలో గుజరాత్, రాజస్థాన్ మొదలైన రాష్ట్రాలలో ఎడారి విస్తరణ కనిపిస్తుంది. ఈ తరహా ఎడారి విస్తరణను అడ్డుకునేందుకు 2022 అక్టోబర్‌లో అడ్వాన్స్‌డ్ జెల్ టెక్నాలజీ(ఇంగ్లండ్) కంపెనీకి చెందిన నిపుణులు ఒక జెల్‌ను తయారు చేసారు. పైపొర గట్టిగా మారి ఇసుకధూళి కొత్తప్రాంతాలకు విస్తరించడం తగ్గుతుంది. మొక్కల విత్తనాలు ఈ జెల్ మీద సాధారణ స్థాయిలో పెరుగుతాయి. ఇసుక నేలల్లోంచి ముడి చమురును వెలికి తీసేందుకు ఈ జెల్ ఉపయోగపడుతుంది.



# అబార్షన్లపై స్త్రీలకే హక్కులిచ్చిన దేశాలు

**ఇటీవల భారత సుప్రీంకోర్టు వైవాహిక స్థితితో సంబంధంలేకుండా మహిళలు చట్టబద్ధంగా అబార్షన్‌పై నిర్ణయం తీసుకోవచ్చంటూ తీర్పు వెలువరించింది. ఇలాంటి హక్కులను ఇచ్చిన దేశాల గురించి గమనిద్దాం..**



సరిగ్గా మూడు నెలల క్రితం అగ్రరాజ్యమైన అమెరికా సుప్రీంకోర్టు అబార్షన్లపై రాజ్యాంగబద్ధంగా మహిళలకు వచ్చిన హక్కుల్ని తోసిపుచ్చుతూ తీర్పు చెప్పడం సంచలనం సృష్టించింది. 1973లో రియో వర్సెస్ వేడ్ కేసు ద్వారా రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కుని యాభై ఏళ్ల తర్వాత కొట్టేసింది. ఫలితంగా కొన్ని పరిమితుల మధ్య అబార్షన్ చేయించుకునే దేశాల జాబితాలో చేరిపోయింది.

అయితే అమెరికాలో రాష్ట్రాలే శక్తిమంతం కావడంతో ఆయా రాష్ట్రాల నిబంధనల ఆధారంగా మహిళలకు అబార్షన్‌పై హక్కులు వస్తాయి. యూరప్ దేశాల్లో అబార్షన్ చేయించుకోవడం అత్యంత సులభమైతే, ఆఫ్రికా దేశాల్లో నిబంధనలు చాలా కఠినంగా ఉన్నాయి. చైనాలో 1953 నుంచి అబార్షన్ చట్టబద్ధం. జనాభా విపరీతంగా పెరిగిపోతూ ఉండడంతో 1970 తర్వాత బలవంతపు అబార్షన్లని కూడా ప్రోత్సహించింది. ఇప్పుడు వృద్ధులు పెరిగిపోతూ ఉండడంతో అనవసరంగా అబార్షన్ చేయించుకోవడానికి వీల్లేదంటూ గత ఏడాది ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## యూరప్ దేశాల్లో..

యూరప్‌లోని అత్యధిక దేశాల్లో మహిళలకు గర్భ విచ్ఛిత్తిపై హక్కులున్నాయి. 12-14 వారాల్లోపు అబార్షన్ చేయించుకోవడం పూర్తిగా మహిళల ఇష్టమే. ఇంగ్లండ్, స్కాట్‌లాండ్, వేల్స్‌లో 1967లో చట్టం చేశారు. 24 వారాల వరకు అబార్షన్ చేయించుకోవచ్చు. యూకేలో గర్భంలో శిశువు సరిగా ఎదగలేదని తెలితే ఎన్నో నెలలో అయినా గర్భాన్ని తీయించుకునే హక్కు మహిళలకి ఉంది. కెనడాలో గర్భ విచ్ఛిన్నానికి ప్రత్యేకంగా చట్టం లేకపోయినప్పటికీ ఏ దశలోనైనా అబార్షన్ చేయించుకోవచ్చు.

యూరప్, లాటిన్ అమెరికా సంప్రదాయ కేథలిక్ దేశాల్లో కూడా మహిళా కార్యకర్తల ఉద్యమాలతో అబార్షన్‌పై హక్కులు కల్పించారు. గత ఏడాది కొలంబియాలో 24 వారాల్లోపు అబార్షన్ చేయించుకోవడం చట్టబద్ధం చేశారు. ఐర్లాండ్‌లో అబార్షన్ చట్టాలకు పరిమితులు విధించడంపై 2018లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మహిళలు తిరస్కరించారు.

12 వారాల్లో ఎప్పుడైనా అబార్షన్ చేయించుకునే హక్కు వారికి ఉంది. న్యూజిలాండ్‌లో 2020లోనే మహిళలకు అబార్షన్లపై హక్కులు వచ్చాయి.

## 24 దేశాల్లో అబార్షన్ చట్ట విరుద్ధం

ప్రపంచంలోని 24 దేశాల్లో అబార్షన్ చేయించుకోవడం చట్ట విరుద్ధం. వీటిలో అత్యధికంగా ఆఫ్రికా దేశాలుంటే ఆసియా, సెంట్రల్ అమెరికా, యూరప్‌కు చెందిన దేశాలు వీటిలో ఉన్నాయి. సెనగల్, మార్షినియా, ఈజిప్టు, లావోస్, ఫిలిప్పైన్స్, ఎల్ సాల్వోడర్, హోండరస్, పోలాండ్, మాల్టాలో మహిలలు చట్టబద్ధంగా అబార్షన్ చేయించుకోలేరు. కొన్ని దేశాల్లో అబార్షన్ చేయించుకుంటే కఠినమైన శిక్షలు కూడా ఉంటాయి. ఎల్ సాల్వేడర్‌లో మహిళలు అబార్షన్ చేయించుకుంటే దోషిగా నిర్ధారించి జైలుశిక్ష కూడా విధిస్తారు. పోలాండ్ గత ఏడాదే అబార్షన్లపై సంపూర్ణ నిషేధం విధించింది. పునరుత్పత్తి సామర్థ్యం కలిగిన వయసులో ఉండే ప్రపంచ మహిళా జనాభాలో 5 శాతం మంది ఈ 24 దేశాల్లోనే ఉన్నారు. అంటే దాదాపు తొమ్మిది కోట్ల మందికి మహిళలకి అబార్షన్ చేయించుకునే హక్కు లేదని సెంటర్ ఫర్ రీప్రొడక్టివ్ రైట్స్ సంస్థ నివేదికలో వెల్లడైంది.

## 50 దేశాల్లో పరిమితులతో హక్కులు

దాదాపు 50 దేశాల్లో అబార్షన్ చేయించుకునే హక్కు ఉన్నప్పటికీ కొన్ని పరిమితులున్నాయి.

లిబియా, ఇండోనేషియా, నైజీరియా, ఇరాన్, వెనిజులాలో తల్లిప్రాణాలు ప్రమాదంలో ఉంటే మాత్రమే అబార్షన్ చేయించుకోవచ్చు. మిగిలిన దేశాల్లో అత్యాచారం, అవాంఛిత గర్భధారణ, గర్భంలో శిశువు ఎదుగుదలలో లోపాలుంటే అబార్షన్ చేయించుకోవడానికి అనుమతినిస్తారు.

బ్రెజిల్‌లో అత్యాచారం వల్ల గర్భం వచ్చినా, గర్భస్థ పిండం ఎదగకపోయినా గర్భస్రావానికి అనుమతిస్తారు కానీ వైద్యులు, వైద్య రంగంలో కనీసం ముగ్గురు అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ❐

# కేరళ మధుర ఫలహారం



## అడ ప్రధమన్

కేరళీయులకి ఎంతో ఇష్టమైన మధుర ఫలహారం. అడ ప్రధమన్ లేదా పాల్ అడ ప్రధమన్. ఈ పాయసం లేకుండా విందు పరిపూర్ణం కాదు.

**కావలసిన పదార్థాలు**

బెల్లం-300 గ్రాములు; అడ-250 గ్రాములు(అడ కేరళ స్టోర్స్ లో దొరుకుతాయి); కొబ్బరి కాయలు-2; నేయి-100 మిల్లీ గ్రాములు; జీడిపప్పు, కిస్మిస్, ఎండుద్రాక్ష-తగినన్ని; ఏలకుల పొడి-చిన్న అర స్పూను.

**తయారు చేసే విధానం**

బెల్లాన్ని తీగ పాకంలా చేసుకుని వేరేగా ఉంచుకోవాలి. అడ ఉడకపెట్టి నీరు వార్చి ఉంచాలి. కొబ్బరికాయలు కోరి తురుముని బాగా పిండి మొదటిసారి కొబ్బరిపాలు మూడు కప్పులు, రెండవసారి పిండిన కొబ్బరిపాలు అయిదు కప్పులు తీయాలి. బెల్లం బాగా కరిగి తీగపాకంలో ఉడికిన అడ వేసి అడుగు పట్టకుండా కలుపుతూ ఉండాలి. మధ్య మధ్య నేయి వేస్తుండాలి. బాగా దగ్గరికి అయిన తరువాత తీసిపెట్టుకున్న అయిదు కప్పుల కొబ్బరి పాలు పోసి ఇగిరేంతవరకు కలుపుతూ ఉండాలి. ఇందులోకి మొదట తీసిన కొబ్బరిపాలు పోసి కలిపి దించాలి. నెయ్యిలో జీడిపప్పు, కిస్మిస్, ఎండుద్రాక్ష వేయించి కలపాలి. ఆ తరువాత ఏలకుల పొడి జల్లి చల్లారాక ముందే వడ్డించాలి.

## పాలడ ప్రధమన్



ఇది అడ ప్రధమన్‌లానే చేయాలి.

**కావలసిన పదార్థాలు**

అడ-300 గ్రాములు; పాలు-లీటరున్నర; నేయి-తగినంత; పంచదార-300 గ్రాములు; జీడిపప్పు, ఎండుద్రాక్ష, ఏలకుల పొడి-కావలసినంత.

**తయారు చేసే విధానం**

అడ బాగా ఉడకబెట్టి నీరు వార్చాలి. పాలలో పంచదార కలిపి బాగా మరగపెట్టాలి. అందులో ఉడికించిన అడ వేసి కలుపుతూ ఉండాలి. ఇందులోకి జీడిపప్పు, కిస్మిస్, నేతిలో వేసి వేయించి కలపాలి. ఇందులో ఏలకుల పడి, జల్లాలి. గోరువెచ్చగా వున్నప్పుడు వడ్డిస్తే మరింత రుచికరంగా ఉందాలి.

## చక్క ప్రధమన్

పనస పండు-300 గ్రాములు(తొక్క తీసినవి); బెల్లం-300 గ్రాములు; కొబ్బరికాయలు-2; నేయి-100 మిల్లీ గ్రాములు; జీడిపప్పు, కిస్మిస్-50 గ్రాములు, ఏలకులపొడి-చిన్న స్పూన్; జీలకర్ర పొడి-చిన్న అర స్పూను.

తయారు చేసే విధానం

పనసపండు ఉడకపెట్టి బాగా చిదమాలి లేదా మిక్సీ లో కొట్టి ఉడకపెట్టవచ్చు. బెల్లం కరిగించి తీగపాకం చేసి ఉండాలి. కొబ్బరి కోరి చిక్కని కొబ్బరి పాలు తీసి ఉంచాలి. సగం నేయి తీసుకుని పనసముద్దని వేసి బాగా కలపాలి.

ఇందులో బెల్లంపాకం పోసి సన్నని సెగ మీద పెట్టి బాగా కలపాలి.

కొబ్బరిపాలు వేసి బాగా కలిపి దించాలి. మిగతా నెయ్యిలో జీడిపప్పు, కిస్మిస్ వేసి వేయించి కలపాలి. అందులో ఏలకుల పొడి, జీలకర్ర పొడి వేసి కలిపి వడ్డించాలి.

## మ్యాంగో పాయసం

ఇది కేరళవాళ్లకి చాలా ఇష్టమైన పాయసం.

కావలసిన పదార్థాలు

బాగా పండిన మామిడిపండ్లు(తొక్క తీసి ముక్కలు చేసి ఉంచుకోవాలి సగ్గుబియ్యం(ఉడకబెట్టినవి)-50 గ్రాములు; కొబ్బరిపాలు-రెండు కప్పులు; నేయి-తగినంత; ఏలకుల పొడి-తగినంత; జీడిపప్పు, కిస్మిస్-పది చొప్పున; బెల్లం-అర కిలో.

తయారు చేసే విధానం

గిన్నెలో నేయి పోసి వేడి చేసి అందులోకి ముక్కలు చేసిన మామిడిపండ్లు వేసి కలపాలి. దీనిలో కరిగించిన బెల్లం పోసి బాగా కలపాలి. బాగా దగ్గరికి అయి చిక్కపడుతున్నపుడు కప్పు కొబ్బరిపాలు పోసి కలపాలి. ఇందులోకి ఉడకపెట్టిన



ఉంచిన సగ్గుబియ్యం పోసి మరో కప్పు కొబ్బరిపాలు పోసి అడుగు పట్టకుండా కలుపుతూ ఉండాలి. మరగపెట్టకుండా సన్నని సెగ మీద ఉంచి ఇందులోకి ఏలకుల పడొడి వేసి గ్యాస్ ఆఫ్ చేసి మూత పెట్టి ఉంచాలి. జీడిపప్పు, కిస్మిస్ నేతిలో దోరగా వేయించి పాయసం పైన వేసి అయిదు నిమిషాలు మూత పెట్టి ఉంచి వేడిగా వడ్డించాలి. చల్లదనం కోరుకునేవారు ఫ్రిజ్‌లో పెట్టుకోవచ్చు.

**ఈ.ఎస్.మాధవన్**

# 'గండం' దశ గుణం భవేత్

కథ

**గండ్రకోట సూర్యనారాయణ శర్మ**

పదో తరగతి పిల్లలకి పరీక్షిత్తు కథ చెప్తున్నాడు నలభై ఏళ్ల నాగరాజారావు. ఆ క్లాసులో పది మంది ఆడపిల్లలు, ఇరవై మంది మగపిల్లలు ఉన్నారు.

బదిలీ మీద నెల రోజుల క్రితం ఆ స్కూలుకు వచ్చిన అతడు, ఆ స్కూలు వాతావరణం చూసి తెగ చికాకు పడిపోయాడు.

"ఊరి వెలుపల పాడు కోనేరు చెంత మనుజులెవ్వరు మసలని మారుమూల" అన్నట్టుగా ఊరి నుంచి దూరంగా విసిరేసినట్లుగా ఉందా పాఠశాల. గడ్డితో కప్పబడిన పాకలోనే క్లాసులు, ఆ క్లాసుల్ని విడదీస్తూ మధ్యలో మట్టిగోడలు. "ఈ స్కూలేంటి? ఈ వాతావరణమేంటి?" అనుకున్నాడు. అయితే చుట్టుపక్కల నాలుగైదు పల్లెటూళ్లకు అదొక్కటే ప్రభుత్వోన్నత పాఠశాల.

గవర్నమెంట్ ఉద్యోగం రాకముందు అతడు ఐదేళ్లు ఒక కార్పొరేట్ స్కూల్లో పని చేశాడు. అక్కడి రిచ్‌నెస్ చూసి, ఇక్కడికొస్తే "రాజుగారిని చూసిన కళ్లతో.." అన్నట్లనిపించింది.

అతనికింకా కార్పొరేట్ మత్తు దిగలేదు. అందుకే విషయాన్ని మంత్రిగా ఉన్న తన మేనమామతో మొరపెట్టుకోవటంతో నెల రోజుల్లోనే పట్నానికి బదిలీ ఆర్డర్ వచ్చేసింది.

.....

అంతకు ముందు ఆ స్కూలుకి వచ్చిన రెండో రోజే హెడ్ మస్టార్ అతన్ని పిలిచి "మాస్టారూ, ఈ రోజు పదో తరగతి తెలుగు మాస్టర్ సెలవు పెట్టారు. ఈ ఒక్క రోజుకి పదో తరగతి పిల్లలకి క్లాసు తీసుకోవాలి. ఏదో ఒక కథ చెప్పి వాళ్ల గొడవ చెయ్యకుండా చూడండి" అని చెప్పటంతో, సరేనంటూ లేచాడు. పదవ తరగతి గదిలోకి అడుగు పెట్టేసరికి అక్కడంతా గందరగోళంగా ఉంది. ఇతన్ని చూసి అందరూ సైలెంట్ అయిపోయారు.

అటెండెన్స్ తీసుకుంటుండగా "లోపలికి రావచ్చా మాస్టారూ" అన్న కమ్మని కంఠం విని తలెత్తి చూశాడు. తలుపు దగ్గర ఒక మెరుపుతీగ లాంటి అమ్మాయి కనిపించే సరికి అతడి కళ్లు పాము కళ్లలా విప్పారాయి. నాగస్వారానికి ముగ్ధురాలైన నాగుపాములా అతడు తలూపటంతో ఆ అమ్మాయి లోపలికి వచ్చింది.

అతడి చూపులు పాములాగా జరజరా ఆమెనే అనుసరించాయి. ఆ అమ్మాయిని చూసిన అతడి మనసు గతి తప్పింది. కొద్దిసేపటికి ఆ అమ్మాయి పేరు ప్రణవి అని తెలిసింది. వాకబు చేస్తే ఆమె తల్లిదండ్రులు కూలి నాలి చేసుకుని బతికే బడుగుజీవులని తేలింది. కాలేజీ రోజుల్లో ఉన్న విచ్చలవిడి తత్వం అతన్నింకా వీడలేదు. అందుకే అతడి మనసు ఆ అమ్మాయి చుట్టూ తిరగసాగిం ది. ఎలాగో క్లాసు పూర్తయిందనిపించి బయట పడ్డాడు. ఆ రోజు రాత్రంతా ఆ అమ్మాయే అతని కలలో కదలాడింది.

అప్పట్నుంచి అతడి మనసు పదో తరగతి చుట్టూ పరిభ్రమించసాగింది. ఏ సబ్జెక్ట్ టీచర్ రాకపోయినా హెడ్ మస్టార్‌ని అడిగి మరీ పదో తరగతి క్లాసులో పాఠాలు చెప్పటానికి వెళ్లసాగాడు. అవసరం ఉన్నా లేకపోయినా ఏదో ఒక మిష మీద ప్రణవి భుజాల మీద చేతులు వేసి, తడుముతూ పలకరించసాగాడు.



అతని మనసులోని ఆలోచనలు గ్రహించలేని ఆ పల్లెటూరి అమ్మాయి ఆ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు.

.....

ఆ రోజు అతనికి ఆ స్కూల్లో చివరి రోజు. కోరి మరీ పదో తరగతికి వచ్చాడు. పరీక్షిత్తు కథ చెప్తున్నాడు.

"పరీక్షిత్తు మహారాజు ఒంటిస్తంభం మేడలో చుట్టూ పురోహితుల్ని కూర్చోబెట్టుకుని మహాభారత పఠనం చేయిస్తున్నాడు. మునికుమారుని శాపం తప్పించుకోవటం అసాధ్యమని తెలిసినా, ఇన్ని జాగ్రత్తలు తీసుకున్న తనని తక్షకుడు ఏ విధంగా చంపబోతున్నాడో ఆయనకు అంతుబట్టకుండా ఉంది. కళ్లు తెరిచినా మూసినా పాములే కన్పించసాగాయి. ఏ చిన్న అలికిడి అయినా పాము జరజరా పాకిన శబ్దంలాగే అనిపించసాగింది. నిమిషాలు భారంగా గడుస్తున్నాయి.

అంతలో ఏమైందంటే.." అని అతడు చెపుతుండగా 'థప్' మంటూ పెద్ద శబ్దం వచ్చింది. అందరూ తల తిప్పి ఆ చప్పుడు వచ్చిన వైపు చూశాడు. చూసినవాళ్లు చూసినట్లే శిలాప్రతిమల్లా కదలకుండా ఉండిపోయారు. వాళ్ల వెన్ను లోంచి జరజరా వణుకు మెదడుదాకా పాకి, నోట మాట పడిపోయినట్లుగా అయిపోయారు. మొదట అతడా శబ్దాన్ని పట్టించుకోకపోయినా అందరూ అటే చూడటంతో తనూ అటు చూశాడు. అక్కడ అప్పటిదాకా తాను వర్ణించిన తక్షకుడే వచ్చాడా.. అన్నట్లుగా క్లాస్ రూం తలుపు దగ్గర నల్లగా నిగనిగలాడుతున్న ఆరడుగుల కృష్ణసర్పం తోక మీద లేచి పడగ విప్పి ఆడుతోంది.

అతడు తేరుకుని "ఎవరూ గొడవ చెయ్యకండి. అలా చేస్తే అది మరీ రెచ్చిపోతుంది. అందరూ బెంచీల పైకి కాళ్లు పెట్టి కూర్చోండి" అన్నాడు. పిల్లలందరూ అతడు చెప్పినట్లే చేశారు. తర్వాత అతడు "ఏదో ఒకటి చేసి ఇక్కడ్నుంచి బయట పడాలి" అనుకుంటూ టేబుల్ అంచుల్ని రెండు చేతుల్లో పట్టుకుని లేవబోయాడు.

అప్పుడు జరిగింది అనుకోని మరో సంఘటన..

అప్పటిదాకా చూరులో వేలాడుతున్న ఇంకొక మహా సర్పరాజం పట్టుతప్పి దబ్బున వచ్చి అతనిముందున్న టేబుల్‌పైన పడింది. ఎంత వేగంగా పడిందో అంతకన్నా వేగంగా చివాలున పడగ విప్పి నిలిచింది.

దాంతో అతడు కుర్చీకి అతుక్కుపోయాడు. అతడి చేతులు టేబుల్ అంచుల మీద అలాగే ఉండిపోయాయి. సరిగ్గా అతని ముఖానికి మూరెడు దూరంగా ఉందా సర్పం. మృత్యువులా తన ముఖంలో ముఖం పెట్టి చూస్తున్న ఆ పాముని చూసి అతడి వెన్నుపాము భయంతో జలదరించింది. అది అతడిని కాటు వేయటానికి ఉత్సాహపడుతున్నట్లుగా పడగను అటూ ఇటూ ఊపసాగింది.

పులి మీద పుట్రలా జరిగిన ఈ సంఘటనతో పిల్లలు బేంబేలెత్తిపోయారు. అమ్మాయిలంతా తన్నుకొస్తున్న ఏడుపును బలవంతాన ఆపుకుంటున్నారు. అయినా వెక్కిళ్లు వస్తూనే ఉన్నాయి. మగపిల్లల్లో కొందరు ధైర్యం చేసి ఏమైనా చేద్దామనుకున్నా, ఆ అలికిడికి మాస్టారుగారి ఎదురుగా ఉన్న పాము ఆయన్ని కాటేస్తుందేమోనని భయపడి కదలకుండా ఉండిపోయారు.

ఎవ్వరూ బయటికి పోవటానికి వీలు లేకుండా కాపలా కాస్తున్నట్లుగా తలుపు దగ్గర అడ్డంగా కనబడుతోంది కాలనాగు.

నాగరాజారావు పరిస్థితి మరీ దుర్భరంగా ఉంది. ఎదురుగా గోధుమ వర్ణంలో ధగ ధగా మెరిసిపోతున్న సర్పం పడగలో పరిసరాలు ప్రతిబింబిస్తున్నాయి. "అది తన ముందు పడటం ఒక్క క్షణం ఆలస్యమయ్యుంటే తాను ఆ కుర్చీలోంచి లేచి అవతలికి వెళ్లిపోయి ఉండేవాడు. కానీ ఇప్పుడీ కుర్చీలో బందీ అయిపోయాడు. తను ఏమాత్రం కదిలినా అది నిర్దాక్షిణ్యంగా కాటు వేసేట్లుంది. కానీ తను ఎంతసేపు ఇలా కదలకుండా కూర్చోగలడు? ఈ ఒక్కరోజు గడిస్తే తనకీ స్కూల్ నుంచి విముక్తి అనుకున్నాడు. కానీ ఈరోజే తనకీ లోకంలోకి విముక్తి అయ్యేట్లుంది. ఏమిటీ వింత పరీక్ష తనకి? అతడి నోటితో పాటు మెదడు కూడా ఎండిపోసాగింది. శరీరంలో ఉన్న నీరంతా చెమట రూపంలో బైటకి రాసాగింది. వెన్నుభాగమంతా ఎప్పుడో తడిసి ముద్దైపోయింది. టేబుల్ మీద పెట్టిన చేతులు ఆన్చి చోటంతా చెమ్మగా తయారైంది. కళ్లార్పడానికి కూడా భయపడిపోయాడు. దాంతో కళ్లవెంబడి ధారాపాతంగా నీళ్లు కారసాగాయి. గొంతు మరీ ఎండిపోయి నాలుక పిడచ కట్టుకుపోసాగింది. కొద్దిగా కుడిపక్కకి తిరిగితే ఒక కూజా, దాని పైన ఒక గ్లాసు ఉన్నాయి. బయటికి పోతే కావాల్సినన్ని నీళ్లు. కానీ 'వాటర్ వాటర్ ఎవ్రీ వేర్.. నాటే డ్రాప్ టు డ్రింక్' అన్నట్లుందతని పరిస్థితి. తలలోంచి బయల్దేరిన స్వేదబిందువొకటి నెమ్మదిగా నుదురు మీదుగా కిందికి దిగసాగింది. ఆ పైన అది తిరిగి రెండు కనుబొమల మధ్య గుండా తన ప్రయాణాన్ని కొనసాగించింది. అప్రయత్నంగా ఆ బిందువును తుడవటానికి అతడి కుడిచెయ్యి కదలబోయింది. ఆ కొద్దిపాటి ప్రకంపనలనే చురుగ్గా పసిగట్టిన ఆ సర్పం చటుక్కున పడగ తిప్పి ఆ చేయి వైపు చూసింది.

అతడి గుండెలు దడదడలాడాయి. ఏమాత్రం చెయ్యి పైకి లేచినా ఈ పాటికి తాను గిలగిలా తన్నుకుంటూ ఉండేవాడు. ముక్కు పై భాగానికి చేరిందా బిందువు. అది అతడికి స్పష్టంగా భూగోళంలా కనిపించసాగింది. అది కులాసాగా, తీరికగా ముక్కుమీది గుండా కిందికి దిగసాగింది. దాన్ని చేత్తో తీసేయాలన్న కండూతిని అతడు బలవంతాన ఆపుకున్నాడు. అక్కడ కొంచెంసేపు వేలాడిందా బిందువు. అది జారి పడిపోతే బాగుండునన్న అతడి ఆశ తీరలేదు. చావుకన్నా, చావు కబళించబోతుందన్న భయం ఎంత దుర్భరమైందో అతనికిప్పుడు అర్థమవసాగింది.

ఎదురుగా ఉన్న ఆ పాము తనని వెక్కిరిస్తున్నట్లుగా మాటిమాటికి తన నాలుకని బయటికి తెచ్చి ఆడించసాగింది. అది పాముకి చెలగాటం, అతడికి ప్రాణసంకటంగా పరిణమించింది.

అతనికి అప్పటిదాకా తాను చెప్పిన కథ స్ఫురణకి వచ్చింది. "పాముకాటు తప్పదని తెలిసీ, ఒంటిస్తంభం మేడ కట్టుకున్న పరీక్షిత్తుకూ, పాముకాటును తప్పించుకోలేక దాని ఎదురుగా ఆ ఒంటిస్తంభంలా బిగుసుకుపోయిన తనకూ పెద్ద తేడా కనిపించలేదు. తన ప్రాణం పోతుందని తెలిసి భారతం చెప్పించుకున్నాడు పరీక్షిత్తు.

తాను భారతం చెప్తుండగా తనని మృత్యువు కబళించబోతోందా? తనకి రక్షణ ఎవరు? ఎప్పుడూ తన గురించి తాను ఆలోచించుకోవటమేగానీ, పక్కవాడికి సాయం చెయ్యటమే తానెరగడు.

'టప్' మంటూ ముక్కున వేలాడుతున్న స్వేదబిందువు జారిపడటంతో 'హమ్మయ్య' అనుకున్నాడు. గొంతు పూర్తిగా ఎండిపోయింది. ఇంకో పది నిమిషాలిలా వుంటే దాహంతో తన ప్రాణం పోవటం ఖాయం. క్లాసు టైం అయిపోవటానికింకా పావుగంట కావాలి. అంటే పదిహేను నిమిషాలు.. తొమ్మిది వందల సెకన్లు..

పామునే చూస్తున్నాడతడు. అతడి కళ్లు కదిలినప్పుడల్లా అది విచిత్రంగా అతడి వైపు చూస్తోంది. అది అలా చూడగానే అతడు స్తంభించిపోతాడు. దాంతో అది మళ్లీ యథాలాపంగా మారిపోతుంది. అతడి రిస్ట్ వాచ్‌లోని సెకన్ల ముల్లు కదులుతున్న శబ్దం అతడి చెవుల్లో చెవిలో జోరీగలా వినిపించసాగింది. పాము పడగ పక్క నుంచి అతడు బిక్కచచ్చిపోయిన పిల్లల మీదికి తన దృష్టిని సారించాడు. మొదటిసారిగా అతడి హృదయంలో జాలి కలిగింది. వాళ్లే కాదు.. ఆ స్థానంలో ఎవరున్నా ఏమీ చేయలేని పరిస్థితి.

ఆ స్కూలు పాక వేసి ఎన్నో ఏళ్లు దాటింది. తిరిగి కప్పు వేయించటానికి ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఊరి పెద్దలెప్పుడో కైంకర్యం చేసేశారు. ఇన్‌స్పెక్షన్ జరిగినప్పుడల్లా అధికారుల చేతులు తడిపి పబ్బం గడుపుకోవటం ఆ ఊరి పెద్దలకు అలవాటైపోయింది. పైకప్పు అక్కడక్కడా లేచిపోయి పెద్ద పెద్ద కన్నాలేర్పడ్డాయి. వర్షం పడితే సెలవు. ఎండాకాలం క్లాసు రూముల్లోకన్నా బయట చెట్లకిందే ఎక్కువగా క్లాసులు నడుస్తుంటాయి. ఇలాంటి స్కూళ్లు ఎన్నున్నాయో దేశంలో! అపాయాలకు ఆలవాలమైన ఇలాంటి స్కూళ్లలో ఎంత మంది దిన దిన గండంగా రోజులు వెళ్లబుచ్చుతున్నారో తెలీదు.

'టప్' మంటూ ముక్కున వేలాడుతున్న స్వేదబిందువు జారిపడటంతో 'హమ్మయ్య' అనుకున్నాడు. గొంతు పూర్తిగా ఎండిపోయింది. ఇంకో పది నిమిషాలిలా వుంటే దాహంతో తన ప్రాణం పోవటం ఖాయం.

ఆలోచనల్లో ఉన్న అతడి ముఖంలో అనుకోకుండా ఒక మార్పు కనిపించింది. ఊపిరితిత్తుల్లోంచి వస్తున్న గాలి శ్వాసనాళంలో మడత పడటంతో సంభవించినమ మార్పు అది. దాంతో అతడు బిర్రబిగుసుకుపోయాడు. తన్నుకొస్తున్న తుమ్మును అతి బలవంతంగా లోపల్లోపలే అణగదొక్కసాగాడు. ఆపుకున్నకొద్దీ అది విజృంభించసాగింది. దీన్ని ఆప...లే...క...పో...తే...

"హాచ్చ్‌చ్చ్‌చ్చ్..." ఆ గది ఆదిరిపోయేలా తుమ్ము తన్నుకొచ్చేసింది. అలా తుమ్మేటప్పుడు అతడి తల, కాటు వేయటానికి వెనక్కి వాలి ముందుకు వచ్చే పాములా ముందుకు విసురుగా వచ్చింది.

అంతే.. అంతకన్నా వేగంగా కదిలిన ఆ పాము అతడి నుదురు పైన 'ఛక్' మంటూ కాటు వేసింది.

కుర్చీలోంచి అమాంతంగా వెనక్కి పడిపోయి గిలగిలా తన్నుకోసాగాడతడు. నోట్లోంచి తెల్లని నురుగు.. అతని చుట్టూ స్కూలు టీచర్లు, పిల్లలు.

"బుస్‌స్‌స్‌స్" మని శబ్దం వినిపించటంతో ఉలిక్కిపడ్డాడతడు. ఎదురుగా పాము... పాము ఎదురుగా తను.. అంటే తనింకా తుమ్మల్లేదన్న మాట. తుమ్మి ఉంటే అన్న ఆలోచనతో ఒక్కసారిగా ఒళ్లు గగుర్పొడిచింది.

అప్పటికి ఐదు నిమిషాలు గడిచింది. ఇంకో పది నిమిషాలు దాటితే బెల్ అవుతుంది. అప్పుడు ఇంకో టీచర్ క్లాస్‌లోకి వస్తాడు. తమ పరిస్థితిని చూసాడు.

అప్పుడు బయటి నుంచి ఏదైనా సాయం అందే అవకాశం ఉంటుంది. అంతవరకూ తనకీ శిలాసదృశ స్థితి తప్పదు. ఇలా అనుకుంటుండగా అనుకోని సంఘటన ఒకటి జరిగింది. తలుపు దగ్గరున్న కృష్ణసర్పం నెమ్మదిగా కదిలి, అతడి టేబుల్ వైపు రాసాగింది. టేబుల్ కింద అతడి కాళ్లు నేలమీద ఉన్నాయి. ఆ పాముని చూడగానే చటుక్కున కాళ్లు పైకి లాక్కోవాలన్న ఆలోచనని బలవంతాన అణచిపెట్టుకున్నాడు.

అతనికి మొదటిసారిగా తన తల్లి నిత్యం పూజించే పరమేశ్వరుడు గుర్తుకొచ్చాడు. "ఈశ్వరా! నీ మెడలో ఉండాల్సిన ఈ ఆభరణాలని ఇలా మా పైకి విసిరి మమ్మల్ని వేధించటం నీకు తగునా? ఇవి లేని నీ మెడ బోసిపోలేదా? వీటిని తీసికెళ్లు స్వామీ" అనుకున్నాడు.

మెల్లిగా పాకుతూ వచ్చిన కృష్ణసర్పం అతడి పాదాలను అలవోకగా స్పృశించింది. కొద్దిసేపు తన కాళ్లలో స్పర్శజ్ఞానం చచ్చిపోతే బాగుంటుందని అనిపించింది అతనికి.

దాదాపు అరగంటసేపు అలా కదలకుండా కూర్చోవటంతో అతడి వెన్ను నొప్పి పుట్టసాగింది. చేతుల్లో చేవ చచ్చిపోయింది. నాలుక పిడుచ కట్టుకుపోయింది. కళ్లు బయటికి వచ్చేస్తున్నాయి.

అతడి ముఖంలో ప్రేతకళ తాండవించసాగింది. కుడి పాదం మీద ఎక్కిన ఆ పాము ఎడమ కాలు మీదుగా జారి మెల్లిగా మళ్లీ తిరిగి తలుపు వైపుగా పోసాగింది.

ఇంతలో ఏదో రిజిస్టర్ పట్టుకుని ఆ స్కూల్ అటెండర్ కూనిరాగం తీస్తూ ఆ క్లాసులోకి ప్రవేశించబోయి తలుపు దగ్గరే ఆగిపోయాడు. ముందుగా అతనికి నాగరాజారావు ఎదురుగా ఉన్న గోధుమవన్నె సర్పం కనిపించింది. అంత లోనే తన వైపుగా వస్తున్న నల్లతాచుని చూడగానే అతని నోట మాట రాలేదు. కెవ్వున అరిచినా ఆ శబ్దం పైకి కూడా రాలేదు. ఒక్క అంగలో అక్కడ్నుంచి బయట పడ్డాడతడు. అతని వెనకే నల్లతాచు తలుపు దాటి క్లాసు బయటకు వెళ్లిపోయింది. బయట నుంచి ఏవో అరుపులు వినిపించసాగాయి. "అంటే కొద్దిసేపట్లో తనకు ఏదో సాయం అందబోతుందన్నమాట" అనుకున్నాడు.

"బుస్‌స్‌స్‌స్" మని శబ్దం వినిపించటంతో ఉలిక్కిపడ్డాడతడు. ఎదురుగా పాము... పాము ఎదురుగా తను.. అంటే తనింకా తుమ్మల్లేదన్నమాట. తుమ్మి ఉంటే అన్న ఆలోచనతో ఒక్కసారిగా ఒళ్లు గగుర్పొడిచింది.

విషయం తెలిసి స్కూలంతా గగ్గోలుగా అయింది. అందరూ ఈ క్లాస్ రూంకి కొద్దిగా దూరంలో గుమిగూడసాగారు. ఆ కోలాహలానికి గోధుమవన్నె సర్పం తపోభంగమైన మునిలా కదిలింది. బయట నుంచి సహాయం రాకపోగా అపాయమే ఎక్కువ జరుగుతుందేమోనని అతడు భయపడిపోయాడు. ఈ సమస్య నుంచి బయటపడే మార్గం ఏమాత్రం కనుచూపుమేరలో కనిపించలేదు.

అప్పుడు లేచిందా అమ్మాయి... పదో తరగతి చదువుతున్న ప్రణవి. మెల్లిగా లేచి నాగరాజారావు వైపు నడిచింది. టేబుల్ మీద ఉన్న పామునే చూస్తూ, చేతిని లయగా ఆడిస్తూ నాగరాజారావు ముందున్న టేబుల్ పక్కకి వచ్చి నిలబడింది. ఆ అమ్మాయి చూపులు ఆ పాము మీదనే కేంద్రీకృతమై ఉన్నాయి. పాము కూడా తల తిప్పి ఆ అమ్మాయిని చూసింది. అయినా నాగరాజారావు తన కుర్చీలోంచి లేచే ధైర్యం చెయ్యబోయాడు. టేబుల్ పైనున్న అతడి చేతులు రెండూ బిగుసుకుపోవటంతో కలిగిన కొద్ది మార్పుకే ఎదురుగా ఉన్న పాము ఒకసారి ఇటు తిరిగింది. అతని ఆలోచనలని భగ్నం చేస్తూ, బెంచి మీద ఉన్న పిల్లల్లో ఒక అమ్మాయి కళ్లు తిరిగి కింద పడిపోయింది. ఉన్నట్టుండి 'దబ్బు' మంటూ శబ్దం రావటంతో టేబుల్ పైనున్న సర్పం 'స్‌స్‌' మంటూ అటు తిరిగింది ఒక్క క్షణంసేపు.

అంతే.. ఆ ఒక్క లిప్త కాలాన్నీ సద్వినియోగం చేసుకుంది ప్రణవి. తన కుడి చేతితో ఆ పాము మెడ పట్టేసుకుంది.

అదే సమయంలో ఎడమ చేత్తో నాగరాజారావు కూర్చున్న కుర్చీని గట్టిగా వెనక్కు నెట్టేసింది.

దాంతో అతడు కుర్చీతో సహా వెనక్కు విరుచుకుపడి పోయాడు.

పామునలాగే పట్టుకున్న ప్రణవి, వెంటనే ఒక్క ఉదుటున క్లాసు బైటికి పరిగెత్తింది.

.....

అతనికి స్పృహ వచ్చి మెల్లిగా కదిలాడు.

"మీరేం భయపడకండి మాస్టారూ! పాములు వెళ్లిపోయాయి" అన్న మాటలు వినబడటంతో కళ్లు తెరిచి చూశాడు. తన తలను తన ఒళ్లో పెట్టుకుని విసనకర్రతో విసురుతున్న ప్రణవి కనిపించింది. అతడా అమ్మాయి వైపు బేలగా చూశాడు. ఆ అమ్మాయి చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వు చూస్తే అతడికి తన చిన్నతనంలో అమ్మవారు పోసినప్పుడు, తన తలను ఒళ్లో పెట్టుకుని, విసనకర్రతో విసురుతూ, తన కళ్లలోకే చూస్తూ నవ్విన తన తల్లి గుర్తుకొచ్చింది. ●

# చలం అంటే అన్వేషణ

### సాహిత్యం


"దీపం యిచ్చే కాంతి, ఆవు యిచ్చే పాలను బట్టి వాటి విలువలు వున్నట్టే- సంతోషపెట్టడం, సేవించడం, పిల్లల్ని కనటం సామర్థ్యాన్ని బట్టి మహిళ విలువ, గుర్తింపు పొందుతోంది".
ఇది సుమారుగా శతాబ్దం క్రితం గుడిపాటి వెంకటాచలం, ఇంగ్లీషులో 'మ్యాన్ అండ్ ఉమన్' పేరిట ప్రచురించిన మేనిఫెస్టో సారాంశం.

నాటి సమాజంలో తెలుగు సాహిత్యంలో కందుకూరి వీరేశలింగం తిరుగుబాటు సాహిత్యం, వ్యక్తిగత జీవితం ఒక్కటిగా, కలం ఆయుధంగా అవిశ్రాంత పోరాటం సాగించారు.

"స్త్రీకి కూడా శరీరం వుంది. దానికి వ్యాయామం యివ్వాలి. ఆమెకు మెదడు వుంది. దానికి విజ్ఞానం యివ్వాలి. ఆమెకు హృదయం వుంది. దానికి అనుభవం యివ్వాలి" అన్న చలాన్ని సమాజం వెలివేసింది. బూజుపట్టిన పాతివ్రత్య నియమాలు, నీతిచట్టాల సంకెళ్లతో మగ్గుతున్న నాటి మహిళ, అనుభవించే శారీరక, మానసిక వేతన చలాన్ని కదిలించింది.

శ్రీశ్రీ మహా ప్రస్థానం ముందు మాటలలో చలం అన్నట్టుగా "దిక్కులేని దీనుల మూగవేదన, కాలి కింద నలిగిన చీమల కాళ్లు విరిగిన చప్పుడు, నీళ్ల లేక ఎండిపోతున్న గడ్డిపోత ఆర్తనాదం" వినగలిగి స్పందించే సున్నిత సాహితీ హృదయజీవి చలం జీవితానికి ఒక్క నిమిషం విశ్రాంతి లేదు. స్త్రీ జీవితం, చెలాన్ని పీల్చి, నలిపి, ఊపిరాడనీయకుండా శాసించి పాలించింది.

ఈ భూమి మీద అమృతాన్ని నింపగల స్త్రీ స్వేచ్ఛకు తన గుండె నెత్తురులో కలం ముంచి సాహిత్యంతో కొరడా ఝుళిపించారు. నిరంతరం సంఘర్షణ, అశాంతి, నిందారోపణలు, కువిమర్శలు ఎదుర్కొంటూ చలం పోరాటం కొనసాగింది. ఎన్నో నవలలు, నాటికలు, కథలు, వ్యాసాలు, లేఖలు తెలుగు సాహిత్యాన్ని చలం కంపింపచేసారు.



మైదానం, అమీనా, అరుణ, జీవితాదర్శం, దైవమిచ్చిన భార్య, బ్రాహ్మణీకం, స్త్రీ, శశిరేఖ, ప్రేమలేఖలు, మ్యూజింగ్స్, పద్మరాణి, భానుమతి, రుక్మిణి, సావిత్రి, జయదేశ, చిత్రాంగి, శశాంక, పురూరవ, హంపీకన్యలు, ఓ పువ్వు పూసింది, స్టేషన్ పంపు, ఖర్మమిట్లా కాలింది, బిడ్డల శిక్షణ, ఈశ్వరుడు లేని ఆయన మూడు దశాబ్దాల జీవితం, అవిశ్రాంత అన్వేషణగా తెలుగు సాహిత్యాన్ని శాసించి పాలించింది.
"లోకంలో సుఖంగా జీవించడానికి కావాల్సిన ఆలోచనా సరళిని నా పుస్తకాలలో అందించాను. అమలులో వున్న నీతి ఆచారాలు, ఎట్లా ప్రపంచాన్ని కసాయికొట్టుగా మారుస్తున్నాయో చూపాను. ఉత్తమ నీతి అంటే ప్రేమ అనీ, ప్రేమంటే అర్పించుకోవటమని ప్రబోధించాను" అన్నారు.

"లలనా!
ఈ లోకమింతే!
ఏ సత్యమూ లేని
దూరమూ కాలమూ అనే పడుగు పేకలపై
జ్ఞాన కాంతి మెరిపించే తళుకు రూపాలు
ఇదో బొమ్మలాట"
అన్నారు సుధలో చలం.

"నా జీవితాన్ని ఈ భూమి మీదనే అమృతంతో నింపల స్త్రీని యిచ్చారు భగవాన్ నాకు. తృప్తితో నిండిపోయినాను. కానీ అంతటితో నాకు తనివి తీరలేదు. ఆ వెలుగు పైకి ఎక్కడికో ఇంద్రియాలతో అందుకోలేని ఆనందం వైపు చూపుతోంది" అంటారు 1945లో చలం, మహత్తర ఆధ్యాత్మిక అనుభవాల తర్వాత.

1894 మే నెలలో జన్మించిన గుడిపాటి వెంకటాచలం 1979 మే నెలలో తుదిశ్వాస వదిలే వరకు జీవితమంతా వేదన, అంతర్మథనంలో అన్వేషణాయుతంగా చిరఃస్మరణీయత సాధించారు. 85 ఏళ్ల జీవనయానంలో, 59 ఏళ్లు ఆంధ్ర రాష్ట్రంలో, 27 ఏళ్లు అరుణాచలం రమణాశ్రమంలో జీవితానందపు లోలోతుల వెలుగులను వెతుక్కుంటూ జీవితమే సాహిత్యంగా తనను అర్పించుకొన్నారు. సుధ, జీసస్ జీవితం, శుభవార్తలు, భగవద్గీతా వ్యాఖ్యానం, గీతాంజలి(తెలుగుసేత) వంటి రచనలతో ప్రాపంచిక శక్తులకు అతీతంగా అపురూప జీవన వైచిత్రితో బెజవాడలో వున్నా తిరువణ్ణామలైలో వున్నా; నాస్తికుడైనా, ఆస్తికుడైనా జీవితానుభవాలను ఆవిష్కరిస్తూ సమాజాన్ని ప్రభావితం చేసారు. చలం ఝంఝూ మారుతం లాంటి శైలి, ఈటెల్లాంటి భాష ఒక ఆయుధంగా రచనలు, సూటిగా హృదయాలను ఆలోచింపచేస్తాయి.

1927 నుంచి మూడు దశాబ్దాలు చలం చింతా దీక్షితులుకి రాసిన ఉత్తరాలలో ఆయన హృదయ నైర్మల్యం, ప్రేమాస్పదత, వేదనాయుత భావనలు, తెలుగు సాహితీ సీమలో ఆయన లేఖా సాహిత్యం అపురూప నూతనాలంకారాలుగా విలసిల్లుతున్నాయి.

ఆయన అభిమానిగా, 1969-1974 మధ్య ఈ వ్యాస రచయిత ఆయన దగ్గర నుంచి అయిదు ప్రత్యుత్తరాలు పొందగలిగారు.

"భగవాన్నించి నేను అవలోకించిన దివ్యానుభూతి నాకే చాలకుండా వుంది. మీకెక్కడ పంపగలను" అని రాస్తూ- "అప్పుడే కాదు" అని రాసారు.

రమణాశ్రమంలో జీవన చరమాంకంలో వార్ధక్యం కారణంగా వణుకుతున్న ఆ అక్షరాల ఉత్తరం బహుశా చలంగారి ఆఖరి ఉత్తరం కావచ్చు.

మహాకవి శ్రీశ్రీ పేర్కొన్నట్టుగా చలం ఒక మహర్షి. సందేహం లేదు.

**- జయసూర్య**

**శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన నగరం నెల్లూరు. క్రీ.పూ. మూడో శతాబ్దం కాలానికే నెల్లూరు అప్పట్లో 'విక్రమ సింహపురి' దక్షిణాదిలోని ముఖ్య నగరాలకు కూడలిగా ప్రాధాన్యం కలిగిన ప్రాంతంగా ప్రసిద్ధి చెందినట్లుగా లభించిన శిలాశాసనాలు తెలియచేస్తున్నాయి.**

మౌర్య చక్రవర్తి అశోకుని నుండి పల్లవ, చోళ, కాకతీయ, శాతవాహన, పాండ్య, తెలుగు చోడ, విజయనగర... ఇలా ఎన్నో రాజవంశాలు ఈ పట్టణ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసినట్లుగా వివిధ చారిత్రక పరిశోధనా గ్రంథాల ఆధారంగా అవగతమవుతోంది.

ఇలా ఎందరో రాజుల పాలనలో ఉన్న ప్రతి శుక్రవారం స్వర్ణాల చెరువు వద్ద పెద్ద సంత జరిగేది. స్థానికులేగాక విదేశీ వర్తకులు కూడా దానిలో పాల్గొనేవారు. సంతను నిర్వహించే అధికారి అయిన 'కాంచనం' వసూలు చేసిన వర్తక సుంకం నుండి కొంత శాతం శ్రీ ఇరుకళల పరమేశ్వరీ అమ్మవారి నిత్య నైవేద్యాలకు, ఉత్సవాల నిమిత్తం కేటాయించేవారు.

ప్రస్తుతం సంవత్సరానికి ఒకసారి మూడు రోజుల పాటు రొట్టెల పండుగ ఈ స్వర్ణాల చెరువు దగ్గర జరుపుకొంటున్నారు. దేశం నలుమూలల నుండే కాక విదేశాల నుండి కూడా భక్తులు వచ్చి ఈ పండుగ సందర్భంగా రొట్టెలు ఇస్తున్నారు.

స్తంభాల పైనా కొన్ని తెలుగు, తమిళ, దేవనాగరి శాసనాలు ఉండేవట. అవి శిథిలమవడంతో రెండు వేల రెండో సంవత్సరంలో చేసిన ఆలయ పునః నిర్మాణ సమయంలో తొలగించబడ్డాయి. విశాల ప్రదక్షిణా మార్గంలో ఈశాన్యంలో వేపచెట్టు కింద లింగేశ్వరుడు కొలువై

ఆలయదర్శనం

ఉంటారు. ప్రహరీ గోడపైన ఆలయ చరిత్ర లిఖించారు. ఈ గోడల పైన నవ విధ దుర్గా రూపాలైన శ్రీ శైలపుత్రి, శ్రీ కూష్మాండ, శ్రీ స్కందమాత రూపాలను సుందరంగా మలచి నిలిపారు.

నైరుతిలో ఉన్న చిన్న కిటికీ ద్వారా చూస్తే 'శ్రీ నరసింహ కొండ మీద వెలసిన శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి' ఆలయ

# సుఖశాంతులను ప్రసాదించే 'ఇరుకళల పరమేశ్వరి'

ఈ ప్రాంతంలో పురాణ ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయాలకు కొదవ లేదు. నగరంలో, చుట్టుపక్కల ప్రాంతాలలో ఎన్నో విశేష ఆలయాలు నెలకొని ఉన్నాయి. వీటిల్లో చాలావరకు అరుదైనవి ఉన్నాయి.

శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం వాటిల్లో ఒకటి. స్థానికంగానే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుండి కూడా ప్రతిరోజూ ఎందరో భక్తులు దర్శించుకొనే ఈ అమ్మవారు సుమారు ఎనిమిదో శతాబ్దానికి పూర్వమే కొలువు దీరినట్లుగా క్షేత్రగాథ తెలుపుతోంది.

ప్రస్తుత ఆలయం పదకొండు నుండి పన్నెండో శతాబ్దాల మధ్య కాలాల నాటిదిగా చరిత్రకారులు భావిస్తున్నారు.

ఆలయం పక్కనే ఉన్న స్వర్ణాల చెరువును కాకతీయ గణపతిదేవుడు తవ్వించాడు. ఈయన కుమారుడు కాకతీయ ప్రతాపరుద్రుడు ఈ ప్రాంతాన్ని తన సేనాని అయిన ముప్పిడి నాయకుడికి కానుకగా ఇచ్చాడు. వారి తదనంతరం వారి అనుచరులైన 'లోకబోయడు', 'బ్రాహ్మణబోయడు' ఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా తెలుస్తోంది.

లభించిన శాసనాల ఆధారంగా ఇక్కడ అనేక ఆలయాలు ఉండినట్లుగా తెలుస్తోంది. తెలుగు చోడులు, కాకతీయ ప్రభువులు, వారి సేనాపతులు ఈ ఆలయాభివృద్ధికి ఎంతో పాటు పడ్డారు.

పదునాలుగవ శతాబ్దంలో విజయనగర రాజుల ప్రతినిధిగా యాదగిరి ప్రాంతాన్ని పాలించిన 'సావన్న ఒరియులు' కాలంలో



ఈ మధ్య కాలంలో తిరిగి ప్రాచుర్యం సొంతం చేసుకొంటూ పూర్వ వైభవాన్ని ప్రదర్శిస్తున్న ఈ ఆలయం సువిశాల ప్రాంగణంలో నిర్మించబడింది. స్వాగత ద్వారం, రాజగోపురాలు, నూతన నిర్మాణాలు గావించారు. ప్రధాన ద్వారం వద్ద నుండి ఆలయం వైపుకు ఉన్న మార్గంలో ఉత్సవ, కళ్యాణ మండపం కనిపిస్తుంది. ఇక్కడ పక్కనే ఉన్న మండపాలలో భక్తులు పాయసం వండి అమ్మవారికి నివేదన చేస్తారు.

ఈ మండపం పక్కనే శూలం, శక్తిశిల ఉంటాయి. ప్రధాన ఆలయం ఎర్రని బొంత రాళ్లతో నిర్మించబడింది. ముఖమండపం, నమస్కార మండపం, అర్ధ మండపం దాటితే గర్భాలయంలో స్వర్ణాభరణ భూషి తురాలిగా, సప్త వర్ణ పుష్పాలంకరణలో ఉపస్థితి భంగిమలో శ్రీ ఇరుకళల పరమేశ్వరీ అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. నమస్కార మండప ముఖ ద్వారం పైన ఉన్న రాతి స్తంభాల పైన తెలుగు శాసనాలు కనిపిస్తాయి. ఇదే మండపంలో కొన్ని దేవతామూర్తులు కనిపిస్తాయి. పూర్వం ముఖ మండప సముదాయాన్ని చూడవచ్చు.

ప్రతిరోజూ స్థానిక, దూర ప్రాంతాల నుండి భక్తులు వస్తుంటారు. ఆదివారాలలో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కుబడులను తీర్చుకొంటుంటారు. పర్వదినాలలో విశేష పూజలు, వైశాఖ మాసంలో లక్ష పుష్పార్చన నిర్వహిస్తారు.

నవరాత్రులలో ఆలయం అపూర్వ కాంతులను సంతరించుకొంటుంది. కోరినవారి కుటుంబాలలో సుఖశాంతులను ప్రసాదించే దేవతగా ఇరుకళల పరమేశరి అమ్మవారు ప్రసిద్ధి.

చారిత్రక ప్రసిద్ధి పొందిన ఈ ఆలయం నెల్లూరు పట్టణంలో నరసింహ కొండకు వెళ్లే మార్గంలో ఉంది. రైల్వే స్టేషన్ నుండి, బస్సు స్టాండ్ నుండి ఈ ఆలయానికి సులభంగా చేరుకోవచ్చు. చక్కని వసతి, భోజన సదుపాయాలు లభిస్తాయి. ఈ దేవాలయంతో పాటు శ్రీ తల్పగిరి రంగనాయక స్వామి, నరసింహ కొండ, శ్రీ మూల స్థానేశ్వర స్వామి ఆలయాలను సందర్శించుకోవచ్చు.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**



# వంటింట్లో కొత్తగా..

## పోర్టబుల్ ఇండక్షన్ కుకర్



ఈ రోజుల్లో ఓపెన్ కిచెన్‌కి తగ్గట్టుగా కుక్‌వేర్‌ని సెలెక్ట్ చేసుకుంటున్నారు. ఈ కుక్‌వేర్ డివైజ్.. అన్ని వంటకాలను చకచకా చేయడంతో పాటు చూడటానికి కూడా క్యూట్‌గా, అందంగా ఉంది. దీని పేరు రాసోనిక్ పోర్టబుల్ కాంపాక్ట్ ఇండక్షన్ కుకర్. ఇది పది లెవల్స్ పవర్ కంట్రోల్ ఆప్షన్స్‌తో, క్వాలిటీ మెటీరియల్‌తో రూపొందింది. ఈ రెగ్యులేటర్‌ని నిమిషం నుంచి 8 గంటల వరకు సెట్ చేయవచ్చు. దీనికున్న ప్రత్యేకమైన గ్రిల్‌ప్లేట్‌తో పాటు..ఇంట్లో ఉండే పాత్రలను కూడా వినియోగించొచ్చు. స్టెయిన్‌లెస్ స్టీల్, ఐరన్, మాగ్నెటిక్ స్టెయిన్‌లెస్ స్టీల్, అల్యూమినియం వంటి పాత్రలను చక్కగా ఉపయోగించుకోవచ్చు. దీని ధర రూ.9,499/-లు.

## స్మోక్‌లెస్ ఓవెన్..

భోజనప్రియులను ఇట్టే మెప్పించే ఈ



కుక్‌వేర్..బోలెడు వంటకాలను నిమిషాల్లో అందిస్తుంది. దీని పేరు మినీ ఇండోర్ స్మోక్‌లెస్ ఓవెన్ కుకర్. ఇది చూడటానికి సూట్‌కేసులా ఉంటుంది. ఓపెన్ చేస్తే..ఇరు వైపులా గ్రిల్‌ప్లేట్, నాన్‌స్టిక్ బౌల్ వంటివి అమర్చుకుని..వంట చేసుకోవచ్చు.

ఇందులో బ్రేక్‌ఫస్ట్ నుంచి డిన్నర్ వరకూ అన్నీ వండుకోవచ్చు. చికెన్ వింగ్స్, కట్లెట్స్ వంటివి ఒకవైపు.. రైస్ ఐటమ్స్, నూడుల్స్ వంటివి మరోవైపు చేసుకోవచ్చు. హాట్‌పాట్, ఫ్రైయింగ్ పాన్, గ్రిల్‌ప్లేట్ వంటివి డివైజ్‌తో పాటు లభిస్తాయి. డివైజ్‌కి ముందు వైపు మూడు వేరు వేరు రెగ్యులేటర్స్ ఉంటాయి. ఇవి టైమ్, టెంపరేచర్, ఆన్ లేదా ఆఫ్ వంటి ఆప్షన్స్ ఉన్నాయి. దీని ధర రూ.5,907/-లు.

## ఎలక్ట్రిక్ హాట్‌పాట్

ఈ పోర్టబుల్ ఎలక్ట్రిక్ కుకింగ్‌పాట్..చాలా



అంటే చాలా వంటకాలను నిమిషాల్లో సిద్ధం చేయగలదు. పైగా దీన్ని సులభంగా ఎక్కడికైనా మూవ్ చేసుకోవచ్చు. క్లీన్ చేసుకోవచ్చు.

యాంటీ-స్కాల్డింగ్ హ్యాండిల్, హైక్వాలిటీ డబుల్-వాల్డ్ మెటీరియల్‌తో రూపొందిన ఈ మేకర్‌ని వినియోగించడం చాలా సులభం. 1.8 లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ కుకర్‌లో ఇద్దరికీ లేదా ముగ్గురికి సరిపడేలా వంట చేసుకోవచ్చు. పాస్తా, సూప్, ఓట్స్ మీల్, గుడ్లు, రకరకాల రైస్ ఐటమ్స్ వంటివి వేగంగా సిద్ధం చేసుకోవచ్చు. దీనిలో ఆహారాన్ని ఉడకబెట్టుకోవచ్చు లేదా డీప్ ఫ్రై చేసుకోవచ్చు. 300 వాట్స్ నుంచి 600 వాట్స్ వరకూ టెంపరేచర్ అడ్జస్ట్ చేసుకోవచ్చు. ఇలాంటి డివైజ్‌లను బహుమతులుగా కూడా అందించొచ్చు.

## స్టీమ్ కుకర్

ఈ రోజుల్లో మల్టీ ఫంక్షన్ కుక్ వేర్స్‌కి కొదువలేదు. ఆన్‌ఆఫ్ దగ్గర నుంచి ఆటోమాటిక్ షట్‌డౌన్ దాకా వాటంతట అవే ఆపరేట్ అయ్యే టెక్నాలజీ వచ్చేసింది. అయితే పని చేసిపెట్టే మెషిన్ ఎంత స్మార్ట్ అయినా..చూడటానికి క్యూట్‌గా ఉండాల్సిందే అంటుంటారు చాలామంది. అలాంటివారి కోసమే ఈ డివైజ్.

మూడు లీటర్ల సామర్థ్యం కలిగిన..ఈ మల్టీ ఫంక్షనల్ కుకర్ చాలా వెరైటీలను.. రుచికరంగా, ఆరోగ్యకరంగా అందిస్తుంది. ఇది ఆవిరిపై నడుస్తుంది. అందుకోసం దీని వెనుకవైపు వాటర్ ట్యాంక్ ఉంటుంది. దానిలో వాటర్ నింపుకుని.. ముందువైపున్న పాత్రలో వంట చేసుకోవచ్చు. దీనిలో అన్ని రకాల రైస్ ఐటమ్స్, సూప్స్, కర్రీస్ ఇలా చాలానే వండుకోవచ్చు.


హైక్వాలిటీ బోరోసిలికేట్ గ్లాస్ లైనర్‌తో, ఫుడ్‌గ్రేడ్ మెటీరియల్‌తో రూపొందిన దీని కుకింగ్ బౌల్ వేడిని తట్టుకోగలదు.



# పుస్తక ప్రపంచం

**రచయిత జూలియన్ బర్న్స్ ఒక వ్యాసంలో "చదవడం చాలా మందికి కాలక్షేపం. కొందరికి కళ" అని రాశారు. ఇది చాలా నిజమైన మాట. పుస్తకాల భవిష్యత్తు గురించి రచయితలతో పాటు ప్రచురణకర్తలు, పాఠకులు కొందరు ఆందోళన చెందుతుంటారు. చదవడం తగ్గిపోవడం వల్ల ఈ ఆందోళనా, భయమూ.**

కానీ అది నిజం కాదు. ఇ-పుస్తకాల ఆగమనం కొత్త పాఠకులను సృష్టిస్తోంది. ప్రింటింగు ప్రెస్సులలో అచ్చుకు నోచుకునే పుస్తకాలకు ఉన్న గిరాకీ, పఠనాసక్తి అలాగే ఉంటుంది. ఇ-బుక్స్ ప్రజాదరణకు ప్రధాన కారణం వాటి తక్కువ ధర. కానీ సీరియస్ బుక్ రీడర్ ధరను ఒక అంశంగా భావించడు. అచ్చు పుస్తకాలు ఒక ప్రత్యేకమైన అనుభవం. కానీ ఇ-బుక్స్‌తో ఆ అనుభవం పొందలేం. రెండింటీ దారులూ వేర్వేరు. ఇంట్లో పుస్తకాలు ఉండటం అంటే వెయ్యి మంది అనుభవజ్ఞుల చుట్టూజీవించడం లాంటిదే.




## పాఠకులు ఐదు రకాలు

మొదటి రకం పాఠకులు పుస్తకాలు కొంటారు. వారు దాని ధర గురించి పట్టించుకోరు. కానీ వారు కొన్న పుస్తకాన్ని చదవరు. వాళ్లు దానిని 'షోకేస్'లో ఉంచుతారు. దానిని ప్రదర్శన వస్తువుగా చేస్తారు.

కేవలం కాలక్షేపంగా పుస్తకాలు చదివేవారు రెండో రకం. విమానాశ్రయ పుస్తక దుకాణాల్లో ఎప్పుడూ మంచి పుస్తకాలు దొరకవు. సమయాన్ని హరించే పుస్తకాలే ఎక్కువగా కనిపిస్తాయి. అయితే కాలక్షేపం చేసేవారికి అవి కీలకం.

మూడవ వర్గం పేద పాఠకులు. వారు దేనినీ లోతుగా చదవరు. వాళ్లు ముందస్తు ఆలోచనలతో పుస్తకాన్ని చదువుతారు. ఇతర రచయితల కంటే తామనుకున్న రచయితే గొప్పవారని అనుకుంటారు. పుస్తకాలను విమర్శించడం వారి స్వభావం.

నాల్గవ రకం పాఠకులు సీరియస్ రీడర్స్. ఇతరుల సిఫార్సుల కంటే సొంతంగా మంచి పుస్తకాలను గుర్తించి చదివే వ్యక్తులు. చదవడమే ఒక కళగా భావించేవారు. వారికి ఆర్థిక స్థోమత లేనందున పరిమిత పుస్తకాలను మాత్రమే కొనుగోలు చేస్తారు. పుస్తకాలను ప్రత్యేకంగా చదివి అర్థం చేసుకుంటారు.

ఐదో రకం వారికి పుస్తకాలే ప్రపంచం. పుస్తకాల ద్వారా జీవితాన్ని నేర్చుకుంటారు. వారు పుస్తకాలలో మునిగిపోతారు. వాటి ద్వారా జీవిస్తారు. పుస్తకాలు వారికి మార్గనిర్దేశం చేస్తాయి. వచ్చిన డబ్బుతో పెద్ద మొత్తంలో పుస్తకాలు కొంటారు. వారు చదివిన పుస్తకాల గురించి గొప్పగా చెప్పుకోరు. చదవడం ద్వారా మానవ జీవితం గొప్పతనాన్ని తెలుసుకుంటారు.

వీళ్లే కాదు.. సోమరి పాఠకులు, విద్యార్థులుగా నటించి చదివేవాళ్లు, పుస్తకాలు దొంగిలించి చదివేవాళ్లు. మొబైల్ ఫోన్, ఇంటర్నెట్‌లో చదివే వ్యక్తులు, కాలేజీ పరీక్షల కోసం చదివే పాఠకులు, చదవకుండానే పుస్తకాల పేర్లను బయటపెట్టేవారు, సెక్స్ పుస్తకాలను రహస్యంగా చదివే వ్యక్తులు ఇలా... చాలా రకాలు.

ముద్రిత పుస్తకాల సంఖ్య గతంలో కంటే ఎక్కువ. పుస్తక ప్రదర్శనలే అందుకు నిదర్శనం. ఇ-పుస్తకాల రాకతో, పుస్తక లభ్యత సులభమైంది. తీసుకువెళ్లడం సులభం కనుక దాని కోసం ఒక మార్కెట్ అభివృద్ధి చేయబడింది.

కానీ ఇ-బుక్స్ మీకు ప్రింట్ పుస్తకాలలోని సాన్నిహిత్యం, చేత్తో పట్టుకుని పుస్తకం చదివే అనుభూతిని ఎప్పటికీ ఇవ్వలేవు. నిజానికి, టెలివిజన్ ముందు తరంవారు పుస్తకాల ద్వారానే ప్రపంచవాన్ని తెలుసుకున్నారు. ప్రతిరోజూ లైబ్రరీకి వెళ్లేవారు.

ఇక ఈ తరంవారు ఇ-బుక్స్ మాత్రమే చదవడానికి మొగ్గు చూపుతుంటారు. అయితే ఇప్పటికీ జపాన్‌లో ఎనభై శాతం యువత చేతిలో పుస్తకాలు ఉన్నాయని.. రచయిత ఎస్.రామకృష్ణన్ తన జపాన్ యాత్రానుభవాలలో ప్రస్తావించారు.

ప్రయాణం చేస్తూనే వారు చదువుతుంటారట. పుస్తక దుకాణాలు కిక్కిరిసిపోతుంటాయట. అక్కడ అన్ని వయసుల వారికి కామిక్స్ పుస్తకాలంటే ఇష్టమట. పెద్ద నగరాల్లోనే పుస్తక దుకాణాలు ఉంటాయి. ఆ సంఖ్యను కూడా వేళ్ల మీద లెక్కించొచ్చు. మంచి నవల, కవితల పుస్తకం కొనడానికి వెతుకులాడాల్సిందే. ఇప్పుడు ఆన్‌లైన్‌లో పుస్తక విక్రయం జరుగుతోంది. కానీ ఇది చిన్న పట్టణాలకు సుపరిచితం కాదు. కానీ పుస్తక దుకాణానికి వెళ్లి అక్కడి పుస్తకాలను చూసి, ఎంపిక చేసి కొనుక్కుని ఇంటికి తెచ్చుకును అనుభవం మరువలేనిది.

లైబ్రరీలను కేవలం పుస్తకాలకు నిలయంగా మాత్రమే కాక ఇచ్చే స్థలంగా సాంస్కృతిక కేంద్రంగా మారిస్తే అక్కడి కొచ్చే ప్రేక్షకులలో పఠనాసక్తిని పెంచవచ్చు. అలా లైబ్రరీలో కవిత్వ పఠనం, కథలు చదివేవారిని చూసిన సందర్భాలు ఉన్నాయి.

కొన్ని లైబ్రరీలలో డాక్యుమెంటరీలు ప్రదర్శించడం ఎరుగుదును; పుస్తకాలపై చర్చలు ఏర్పాటు చేయాలి. అప్పుడు గ్రంథాలయాలను వెతుక్కుంటూ జనం వస్తారు.

సింగపూర్ నేషనల్ లైబ్రరీ ఇందుకు మంచి ఉదాహరణ. వారు ప్రతి సంవత్సరం భారీ స్థాయిలో సాహిత్య ఉత్సవాలను నిర్వహిస్తారు. రచయితల మాన్యుస్క్రిప్ట్‌లను డాక్యుమెంట్ చేస్తారు.



పాఠకులు ముఖ్యంగా చరిత్ర, సమకాలీన సమస్యలపై పుస్తకాలు, వ్యక్తిత్వానికి సంబంధించిన పుస్తకాలు, అనువాద పుస్తకాలు, సాహిత్య వ్యాసాలు చదివేవారి సంఖ్య ఎక్కువ. నవలలు చదవడానికంటూ అక్కడ ప్రత్యేక పాఠకులున్నారు. నేటికీ వారు నవలలను మాత్రమే వెతుక్కుంటూ చదువుతారు. నవలలకంటూ పాఠకులు ఎప్పటికీ ఉంటారు.

పుస్తక ప్రదర్శన అంటే కేవలం పుస్తకాలను విక్రయించే మార్కెట్ కాదు.



అది ఒక సాంస్కృతిక ప్రదేశం. మన భారతదేశంలో తమిళనాడులో జరిగినన్ని పుస్తక ప్రదర్శనలు మరే రాష్ట్రంలోనూ నిర్వహించరు. అక్కడ పుస్తకాల పండుగ సైన్స్ ప్రదర్శనలా ఉంటుంది. కొలంబస్, వాస్కోడగామా, కెప్టెన్ కుక్ మాత్రమే కనుగొన్న ప్రదేశాలకు వెళ్లడంతో ఆగిపోక కొత్త కొత్త ప్రదేశాలను వెతుక్కుంటూ వెళ్తారు అక్కడి పాఠకులు. ఓ విధంగా చూస్తే పాఠకుడు కూడా ప్రయాణికుడే. కొత్త దేశాలు, కొత్త మనుషులు, కొత్త జీవితాన్ని కూడా పుస్తకాల ద్వారా తెలుసుకుంటారు.

వందలకొద్దీ అనవసరమైన వస్తువులను ఇంట్లో ఉంచుకుంటాం. కానీ పుస్తకాలకు మాత్రం స్థలం ఇవ్వడానికి ఎందుకు నిరాకరిస్తామో ఆలోచించాలి. నిజానికి ప్రతి ఇంట్లో వంద లేదా రెండు వందల పుస్తకాలతో కూడిన చిన్న లైబ్రరీ ఉండాలని నా ఆశ. నిజానికి అదే కుటుంబం నిజమైన ఆస్తి.

కోయంబత్తూరులో ఓ జిల్లా కేంద్ర గ్రంథాలయం వికలాంగుల కోసం అత్యాధునిక విభాగాన్ని నిర్వహిస్తోంది. ఈ విభాగాన్ని పూర్తిగా ఎయిర్ కండిషన్ చేసారు. చూడటానికి ఎంతో అందంగా రూపొందించారు. అంధుల కోసం బ్రెయిలీ పుస్తకాలు, బ్రెయిలీ కంప్యూటర్లు, వినికిడి లోపం ఉన్న పిల్లలు సులభంగా పుస్తకాలు చదవడం, కంప్యూటర్లను ఆపరేట్ చేయడం వంటి ఆధునిక సౌకర్యాలతో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు.

అంగ వైకల్యం ఉన్న పిల్లల కోసం ప్రత్యేక కంప్యూటర్ సిస్టమ్స్, పుస్తకాలు ఉన్నాయి. ఈ లైబ్రరీలో వికలాంగులు చదవడానికి, రాయడానికి వాలంటీర్లు సహాయం చేస్తారు. వికలాంగుల కోసం ప్రత్యేక లైబ్రరీ విభాగం ప్రతి గ్రంథాలయమూ ఏర్పాటు చేస్తే ఎంత బాగుంటుందో కదూ. అంధులకు మాత్రమే ఉపయోగపడేలా ప్రత్యేక గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం ప్రభుత్వ కర్తవ్యం.

కొన్నేళ్ల క్రితం గాబ్రియేల్ గార్సియా మార్క్వెజ్ రాసిన సెంటినరీ ఆఫ్ సాలిట్యూడ్ అనే నవల చెన్నైలో దొరకకపోవడంతో ఓ పాఠకుడు ఢిల్లీ వెళ్లి సంపాదించుకున్నాడు. కానీ ఈరోజు మీరు ఇంటి నుంచే ఏదైనా పుస్తకాన్ని కొనుగోలు చేయవచ్చు. కానీ, వెతికి చదువుకోవాలనే కోరిక ఒకింత తగ్గింది. అది మరీ తగ్గకుండా చూసుకోవాలి.

మిత్రులతో పుస్తకాలు పంచుకోవడం, ఒకచోట చేరి చర్చించుకోవడం,



రచయితకు లేఖలు రాయడం, వీలైతే ఆయన్ను వ్యక్తిగతంగా కలుసుకుని ప్రశంసలు తెలియజేయడం అనేవన్నీ ఇప్పుడు మారిపోయాయి.

పుస్తకాలు చదివేవారికి ప్రపంచం తెలియదు. చాలా మందికి తాము ఫాంటసీలో మాత్రమే జీవించగలమని తప్పుడు ఆలోచన కలిగి ఉంటారు. అది నిజం కాదు. పుస్తక పాఠకులకు తమ చుట్టూ ఉన్న ప్రపంచం గురించి మంచి అవగాహన ఉంటుంది.

పుస్తక దుకాణాలు విజ్ఞాన గ్యాలరీలు. పుస్తక దుకాణానికి వెళ్లడం నాకెంతో ఇష్టం. కొందరు జీవితాంతం సేకరించిన పుస్తకాలు తమ జీవితానంతరం ఏమవుతుందోనని భయపడుతుంటారు. అలాంటి పుస్తకాలను సేకరించి ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు పబ్లిక్ బుక్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి. ఎవరైనా తమ పుస్తకాలను విరాళంగా ఇవ్వాలనే షరతు ఏర్పరచాలి. పుస్తక పఠనాన్ని ప్రజల ఉద్యమంగా మార్చాలి. జ్ఞానోదయం పెరగడానికి ఓ మంచి బాట వేసినట్లవుతుంది.

**- యామిజాల జగదీశ్**

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి.**

## రచనలకు ఆహ్వానం

**ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**
sunmagvaartha@gmail.com



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



కుటుంబ గౌరవం పెంపొందుతుంది. వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. విదేశీ ప్రయాణ సూచనలు అధికంగా వున్నాయి. సన్నిహితుల సహకారం లభిస్తుంది. స్త్రీలకు స్థిరాస్తులు లభిస్తాయి. శత్రువులు మిత్రులవుతారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. ప్రతిఫలం కూడా అలాగే ఉంటుంది. నూతన గృహ యోగం.

## వృషభం



సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. సామాన్య ధన లాభ సూచనలున్నాయి. చోర భయం పొంచి వుంది కనుక విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. భూ వివాదాలు తీవ్రమవుతాయి. ఆధ్యాత్మిక చింతన అలవడుతుంది. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. ఉద్యోగులకు స్థాన చలనం. హోల్ సేల్ వ్యాపారులకు సామాన్యం.

## మిథునం



ఉద్యోగులకు అదనపు బాధ్యతలు ఉంటాయి. శుభ కార్యాల్లో పాల్గొంటారు. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. సాహిత్య సభలు, సమావేశాలకు హాజరవుతారు. వాక్చాతుర్యంతో ముఖ్యమైన పనులు చక్కబెట్టుకుంటారు. కొత్త విషయాలు తెలుసుకుంటారు. వృద్ధాశ్రమాలకు ఆర్థిక చేయూతనిస్తారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి బాగుంటుంది.

## కర్కాటం



పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభిస్తారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకండి. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంగా ఎదుర్కొంటారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభ్యం.

## సింహం



సంతానాభివృద్ధి బాగుంటుంది. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటారు. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. వివాదాలకు దూరంగా వుండడం మంచిది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న వర్తమానం వారాంతంలో అందుకుంటారు. దేశాంతర ప్రయాణం చేస్తారు. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. కాలానుగుణంగా వ్యాపారం చేసేవారికి బాగుంటుంది.

## కన్య



వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. కుటుంబంలో స్వల్ప వివాదాలకు అవకాశం. తీర్థ యాత్రలు చేస్తారు. తాహతుకు మించిన రుణాలు చేయకపోవడం మంచిది. వృథా కాలక్షేపం చేస్తారు. విందు-వినోదాల్లో పాల్గొంటారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. వ్యాపారులు సమయస్ఫూర్తితో వ్యవహరించి అధిక లాభాలు పొందుతారు. చర్చలు వాయిదా వేస్తారు.

## తుల



కుటుంబంలో ఐకమత్యం లోపిస్తుంది. ఆర్థిక ఇబ్బందులుంటాయి. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా వుంటుంది. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలనం. విదేశాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం అందుకుంటారు. ధర్మ రక్షణకై పాటుపడతారు. శత్రువులు మిత్రులవుతారు. సెల్ఫ్ డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. వ్యతిరేకతలు ఎదురైనా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు.

## వృశ్చికం



ఉద్యోగులకు అదనపు బాధ్యతలు పెరుగుతాయి. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. తాహతుకు మించిన రుణాలు చేయడం ఏమాత్రం సముచితం కాదు. భూ తగాదాలు తీరి లబ్ధి పొందుతారు. విదేశీ వస్తువులపై మక్కువ ఏర్పడుతుంది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. చిరు వ్యాపారులకు పోటీ ఏర్పడుతుంది. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. చిరకాల కోరిక తీరుతుంది.

## ధనుస్సు



శుభ కార్యాల్లో పాల్గొంటారు. వ్యవసాయ భూమి కొనుగోలు చేస్తారు. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. శారీరక, మానసిక శ్రమకు లోనవుతారు. అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. విదేశీ వస్తువులపై మక్కువ ఏర్పడుతుంది. ఉద్యోగాభివృద్ధి బాగుంటుంది. స్త్రీలు స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. వృత్తి విద్యాకోర్సుల్లో చేరతారు. రుణాలు మంజూరు.

## మకరం



ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలన సూచనలున్నాయి. పాప కార్య చింతన మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. సామాన్య ధన లాభం. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. భాగస్వామ్య వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. కాలానుగుణంగా వ్యాపారం చేసేవారికి ఆశించిన లాభాలుంటాయి. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది.

## కుంభం




ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. కళాకారులకు సన్మాన యోగం. చోర భయం పొంచి వుంది, విలువైన పత్రాలు/వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. గృహ ప్రాప్తి.

## మీనం



కుటుంబంలో వివాదాలు సమసిపోతాయి. వ్యాపారులు అనుకోని విధంగా కొన్ని చోట్ల నష్టపోతారు. ఊహించని వార్తలు వింటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి ఆశించిన ఫలితాలు ఉండకపోవచ్చు. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రుణాలు మంజూరు.

# సరదాగా కాసేపు నవ్వుకోండి



## చెప్పడం కష్టమే..

"స్టాక్ మార్కెట్‌ను బుల్ అని, బేర్ అని కాకుండా 'కౌ(బుల్‌కు స్త్రీ లింగం) కానీ సో(బేర్‌కు స్త్రీ లింగం) అని పిలిస్తే కరెక్టుగా సరిపోతుంది" అన్నాడు రమేశ్ తన స్నేహితునితో.

"ఎందుకు?"

"ఎందుకేమిటి? మహిళల మనస్సు లాగానే స్టాక్ మార్కెట్ ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పడం చాలా కష్టం.. అందుకే" అన్నాడు రమేశ్, నష్టపోయిన తన సొమ్మును మనస్సులో గుర్తు చేసుకుంటూ.

**- కె.లహరి,** కరీంనగర్

## రోడ్ల మీద ఈత కొట్టవచ్చు..

టీచర్: భారీ వర్షాల కారణంగా నీకు అర్థమైంది ఏంటి?

రవి: చెరువుల్లో, కాలువల్లో మాత్రమే కాకుండా రోడ్ల మీద కూడా ఈత కొట్టవచ్చని.

## టీవీలో చూసి చేస్తాను

అత్తగారు: నీకు వంట రాకపోయినా వచ్చని అబద్ధం ఎందుకు చెప్పావు?

కోడలు: టీవీలో వచ్చే వంటల ప్రోగ్రాములను చూసి నేర్చుకోవచ్చు.. అనే నమ్మకంతో.

## ఎవరికీ చెప్పుకోలేవు

రవి: సైంటిస్ట్‌లు తాము కనిపెట్టిన మందులను జంతువుల మీదే ప్రయోగిస్తారు, ఎందుకు?

గోపి: అవి నోరు తెరిచి ఎవరికీ చెప్పుకోలేవు కనుక.

**- ఎస్.కె.యాకుబ్ పాషా,** ఖమ్మం

## ఇంట్లోనే వున్నావుగా!

సుబ్బారావు : ఏంట్రా అప్పారావ్! నిన్న మీ ఇంటిగేటుకు తాళం వేసి వుంది, ఎక్కడికెళ్లారు?

అప్పారావు : పూర్వ ప్రేమికుల ఆత్మీయ సమ్మేళనానికి వెళ్తానని పొరబాటున మా ఆవిడతో అన్నా. నన్ను బయటకు పోనీయకుండా గేటుకు తాళం వేసింది.



## ఎవరూ లేరు..

ఆఫీసర్ : బాబూ! మీ ఇంట్లో ఎంత మంది వున్నారు?

పిల్లాడు : మా ఇంట్లో ఎవ్వరూ లేరు సార్!

ఆఫీసర్ : మరి ఈ ఇల్లు ఎవరిది?

పిల్లాడు : మాదే సార్!

ఆఫీసర్ : నేను జనాభా లెక్కలకోసం వచ్చాను.

పిల్లాడు : చూడండి సార్! మా నాన్న కూరగాయల మండికి వెళ్లాడు, మా అమ్మ గుడికి వెళ్లింది, నేను బడికి వెళ్తున్నా. ఇక మా ఇంట్లో ఎవరూ లేరు సార్!

ఆఫీసర్ : ఆ...

**- సిజెఎస్ఆర్** బాపట్ల

## హాస్య కవిత

ఓ..! అతిలోక సుందరీ
నా ప్రియ అందాల
ప్రేమ దోమ సుందరాంగి
నీ కోసం
మూసీ నదిలో
కట్టించాను ప్రేమ మందిరం.
ఓ..! మతి లేని నా ఈగ
ప్రేమ సుందరీ నీ కోసం
నేను కూడా కట్టించాను
పెంట దిబ్బల పైన
ప్రేమ లేని మందిరం
ఇక కలిసి కాపురం
చేయలేం ఇద్దరం
చేస్తున్నా నా ప్రేమ మీద ప్రమాణం.

**- సంపంగివారి జయచంద్రారెడ్డి,** బాపట్ల

## వడ్డాణం ఇస్తానంది..

తల్లి : రవీ! నువ్వు పాసవుతావని పక్కింటావిడ, నువ్వు పాసవవు అని నేను పందెం వేసుకున్నాంరా! అందువల్ల నువ్వు పాసవవు.

తండ్రి: రవీ! ఏంరా నువ్వు పాసవలేదు.

రవి : అమ్మవల్లే..!

తల్లి: బాబూ పాసవకపోతే పక్కింటావిడ వడ్డాణం ఎరువిస్తానని అందండీ!

**- వైదా ఈశ్వరరావు,** విశాఖపట్నం

## సగం జీతం ఉందిగా

మాజీ భర్త: విడాకులు వచ్చాయని సంతోషిస్తున్నావు కానీ అమాయకురాలివి ఎలా బతుకుతావో ఏమో. స్వయంగా ఉప్మా చేసుకోవడం కూడా రాదు నీకు..

మాజీ భార్య: మీరు అంతగా జాలిపడక్కర్లేదు లెండి. మీ జీతంలో సగం నాకే వస్తుందిప్పుడు. దాంతో నేను స్విగ్గీల ఆర్డరు పెట్టుకుని జీవితమంతా కాలు మీద కాలేసుకుని కూర్చుని తినొచ్చు..

## జోక్స్‌కు ఆహ్వానం

మీరు పంపే జోక్స్ హాస్యాన్ని పండించేలా ఉండాలి.
కాపీ జోక్స్‌ను పంపకండి. చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080
sunmagvaartha@gmail.com



**చిత్రభారతి**

**వాశిరాజు ప్రకాశం**

**"ఇది మల్లెల వేళయని.. ఇది వెన్నెల మాసమని తొందరపడి ఒక కోయిల ముందే కూసింది విందులు చేసింది" అనే మధురమైన గీతం మారుతున్న తరాలకు సైతం ఒక హృదయ**

# ప్రతి సినిమాకు ఓ అందమైన చరిత్ర

**వీణ.**

'సుఖదుఃఖాలు' చిత్రంలో తెర మీద నటి వాణిశ్రీ పాడిన ఈ పాట గురించి.. రాసే ప్రేమ రాయగలిగిన మమకారం వుంటే అక్షరాలు సత్యరూపాలై కొలయేటి వరదల్లా సాగిపోతాయి.

'సుఖదుఃఖాలు' సినిమా చరిత్ర తెలుగులో కథానాయకుడు చంద్రమోహన్ ప్రతిభ వెన్నెలజల్లులా విరిసింది. ఈ తెలుగు చిత్రం మాతృక తమిళ చిత్రం 'మేజర్ చంద్రకాంత్'. యాభై సంవత్సరాల క్రితం దర్శకులు బాలచందర్ అందించిన అద్భుత కావ్య సంపద తమిళ చిత్రం 'మేజర్ చంద్రకాంత్'.

ఆ రోజుల్లో 1970 కాలంలో దర్శకులు బాలచందర్ రంగస్థలానికి ఆత్మీయుడై నిలిచారు. వృత్తిరీత్యా ఆయన అలనాటి ఎ.జి.ఆఫీసులో ఉద్యోగం. ప్రవృత్తి ప్రకారం రచయితగా ప్రసిద్ధుడు. ఆ రచనా ప్రవాహంలో తమిళ భాషలో ఆయన అందించిన ఆణిముత్యమే 'మేజర్ చంద్రకాంత్'.

తెలుగు భాషతో సంబంధం లేని తమిళ చిత్రం యిది. ఈ చిత్రంలో మేజర్ పాత్ర పోషించిన సుందర రాజన్ కాలక్రమంలో తమిళ సినిమా రంగంలో 'మేజర్' అనే గౌరవంతో ప్రసిద్ధికెక్కారు. తమిళ చిత్రంలో ఆయన అంధుడిగా, హీరోయిన్‌గా జయలలిత, కామెడీ పండించే నవ్వుల నాగేష్ నటించారు, మేజర్‌కు తోడుగా నిలిచారు.

సినిమా పేరు మేజర్ చంద్రకాంత్ కనుక కథ యావత్తూ మేజర్ పాత్ర పరిధుల్లోనే తిరుగుతూ వుంటుంది. సినిమాలో ఆయన అంధుడైనా గొప్ప విజ్ఞానం కలిగిన వ్యక్తి. తాను కూర్చునే కుర్చీలో చిన్నపాటి శబ్దం అయినా వెంటనే గ్రహించే శక్తివంతుడు.

మేజర్ చంద్రకాంత్ చిత్రాన్ని తెలుగులో నిర్మించేందుకు నిర్మాత ఏకామ్రేశ్వరరావు, రాఘవ సంయుక్తంగా





చక్కని ప్రయత్నం చేశారు. తమిళ చంద్రకాంత్ విలువలు కాపాడేందుకు ఆయా పాత్రల్లో మేజర్‌గా ఎస్.వి. రంగారావు, హీరోయిన్‌గా వాణిశ్రీ, నాగేష్ పాత్రలో చంద్రమోహన్ అద్భుతంగా నటించారు. ఈ సందర్భంలో ఒక పాట జ్ఞాపకానికి వస్తోంది. చంద్రమోహన్‌కు హీరోగా తొలి అవకాశం యిచ్చిన బి.ఎన్.రెడ్డి మరొక అవకాశం యివ్వలేదనీ అది న్యాయం కాదని ఆనాటి పత్రికలు విమర్శలు గుప్పించాయి. ఆ కోరిక తీర్చేందుకు అన్నట్లు తెలుగులో 'సుఖదుఃఖాలు తయారయింది. ఈ సినిమాలో చంద్రమోహన్ నటన చూసిన బి.ఎన్.రెడ్డి తన తప్పు తానే తెలుసుకున్నారని ఆత్మీయుల ఉవాచ. అయినా ఫరవాలేదు.. ప్రతిభ వెన్నెల లాంటిది. ప్రతిభను ఆపలేరు. చంద్రమోహన్ తన ప్రతిభకు గౌరవం యిస్తూ వరుసగా చిత్రాలు చేస్తూ వచ్చారు. నిన్న మొన్నటి వరకు ఆయన అందరివాడే. ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటూ గత వైభవానికి, అంతటి వైభవాన్ని అందించిన దర్శకులకు కృతజ్ఞతలు చెప్తుంటారు.


ఆ వరుసలో ఒక ఆణిముత్యం కళాతపస్వి ఫాల్కే విజేత విశ్వనాథ్ నవరసభరితంగా అందించిన చిత్రాలు చాలా వున్నాయి. చంద్రమోహన్, తాళ్లూరి రామేశ్వరి కలిసి పాడిన ఆ తొలి గీతం నేటికీ మధుర మాధుర్యం.

అంతటి ప్రతిభ వున్న చంద్రమోహన్ కాలం పరుగులు తీసినా ఆయనకున్న మర్యాద, మమకారం చెక్కుచెదరలేదు. తరచుగా అక్కడక్కడ కలుస్తూ వుంటారాయన. ఆయన కలిసినప్పుడల్లా ఆనాటి స్నేహబంధాలు గుర్తుకు వస్తుంటాయి. చంద్రమోహన్ జీవన విజయంలో నిర్వివాదంగా 'పదహారేళ్ల వయస్సు'. ఇదే చిత్రాన్ని ఒరిజినల్ తమిళంలో 'పదునారు వయతినిలే'గా దర్శకుడు భారతీరాజా దర్శకత్వంలో తయారయింది. కమల్‌హాసన్, చంద్రమోహన్ అందరికీ అప్పులయినా అభిమానులకు ఆత్మీయ బంధువులు. చంద్రమోహన్ జీవన విజయాల్లో ఆయనకు 'ఫిలింఫేర్' ఆంగ్ల పత్రిక గొప్ప గౌరవ పురస్కారం ఇచ్చింది. ఆ సభను మనసారా ఆనందించటానికి ఈ వ్యాస రచయిత వెళ్లి నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు నేటికీ ఓ మధుర మందారాలు.

మనిషి మనిషికీ ఓ చరిత్ర.. అలాగే ప్రతి సినిమాకు ఓ గొప్ప చరిత్ర. ఆనాటి వారు వేసిన పునాదుల మీదే తెలుగు సినిమా చరిత్ర నేటికీ సుస్థిరంగా ఉంది. ◆


ఒక్క బాటిల్ ఖర్చుతో ఎంత సన్నగా కనిపిస్తున్నావు.. చూడు మల్లె తీగలా ... !!
Zakir...


అవును రావణుడే...! మా సీన్మాలో అంతే..!!
Zakir...


ఆయన స్టార్ హీరో కదా... ఫైట్ చేయరు.. 'డూప్' వచ్చాక రా..!!
హీరో
.. రేయ్..!
Zakir...

ఈ వారం కా'ర్టూన్స్'



ఓవెల్ ఆకారంలో వున్న ‘చకా’ సరస్సు చైనాలో ఉంది. ‘చకా’ అంటే టిబెటన్లో ‘ఉప్పునీటి సరస్సు’ అని అర్థం. ఈ సరస్సులోని నీటిలో సోడియం క్లోరైడ్ అధికంగా ఉందట. ఉప్పు నిల్వలతో పాటు అక్కడి వాతావరణం వల్ల సరస్సు అద్దంలా మారిపోయింది. అందువల్ల దీనికి ఆకాశానికి అద్దం అనే పేరు వచ్చింది. ఎంత దూరం నడిచినా అరికాళ్ల లోతు వుండే చకా సరస్సు టూరిస్టుల స్పాట్‌గా మారింది.





